

ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 32.0
కనిష్ఠం : 25.0



వడ్డీ కార్పొరేషన్ చైర్మన్‌గా ఘంటసాల వెంకటలక్ష్మి

దెందులూరు, ఆగస్టు 12 (ఆంధ్ర జ్యోతి) : ఏపీ వడ్డీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా ఘంటసాల వెంకటలక్ష్మిని నియమించారు. జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా, జాతీయ మత్స్యకార సంఘం రాష్ట్ర మహిళ అధ్యక్షురాలిగా ఉన్న దెందులూరు మండలం పత్తికోళ్లలంక గ్రామానికి చెందిన వెంకటలక్ష్మిని వడ్డీ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమిస్తూ సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌లు ప్రకటించారు. కొల్లేరు లంక గ్రామాల్లో వడ్డీ కులస్తుల అభివృద్ధి, సంక్షేమానికి చిత్తశుద్ధితో పనిచేస్తానని వెంకటలక్ష్మి తెలిపారు. ఆర్‌టీసీ జోనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, జనసేన పార్టీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు, విళ్ల శ్రీనివాసరావు, మోరు వెంకట నాగరాజు, జనసేన నాయకులు, కార్యకర్తలు ఆమెకు అభినందనలు తెలిపారు.



ఏలూరు క్యాంపు కార్యాలయంలో చిన్నారులకు నులి పురుగుల నివారణ మాత్రలు వేస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

యుద్ధ ప్రాతిపదికన బంగారు కుటుంబాల అనుసంధానం

అధికారుల సమీక్షలో కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : పీ-4 కార్యక్రమంలో భాగంగా బంగారు కుటుంబాలకు అవసరమైన అనాలిసిస్ సర్వే, మార్గదర్శకులతో కుటుంబాల అనుసంధాన ప్రక్రియను యుద్ధ ప్రాతి పదికన పూర్తిచేయాలని కలెక్టర్ వెట్రి సెల్వి అధికారులను ఆదేశించారు.పీ-4పై జిల్లా అధికారులు, ఎంపీడీవోలు, మున్సి పల్ కమిషనర్లతో మంగళవారం టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. మార్గదర్శకులపై ఎటువంటి వత్తిడి లేకుండా బంగారు కుటుంబాల అనుసంధానం 96 శాతం పూర్తి చేశామన్నారు. జిల్లాలో నిర్ధేశించిన లక్ష్యాల మేరకు రీసర్వే పను లను వేగవంతం చేస్తున్నామని కలెక్టర్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజ యానంద్‌కు వివరించారు. కలెక్టర్లతో సచివాలయం నుంచి మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. నులి పురుగుల నివారణలో మంగళవారం జిల్లావ్యాప్తంగా చేపట్టిన అల్బెండజోల్ మాత్రల పంపిణీ 94.98 శాతం పూర్తయింది. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో చిన్నారులకు కలెక్టర్, డీఎం హెచ్‌వో మాత్రలు వేశారు



స్త్రీ శక్తి పథకం పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఏలూరు డీపీటీవో షబ్నం, డిపో మేనేజర్ వాణి

మూడు రకాల బస్సుల్లో ఉచిత ప్రయాణం

ఏలూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణాలకు సంబంధించి జిల్లా వ్యాప్తంగా ఈనెల 15 నుంచి మూడు బస్సు డిపోల పరిధిలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఏలూరు ప్రజా రవాణాధికారి (డీపీటీవో) షేక్ షబ్నం తెలిపారు. మంగళవారం దీనికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. స్త్రీ శక్తి పథకం అని నామకరణం చేశారని, దీనికి సంబంధించి అన్ని బస్టాండ్లలో పోస్టర్లు, బ్యానర్లతో ప్రచారం చేపట్టామన్నారు. మహిళలు, బాలికలు, ట్రాన్స్ జెండర్లు ఐదు రకాల బస్సుల్లో రాష్ట్రవ్యాప్తంగా ప్రయాణాలకు అవకాశం ఉందని, మన జిల్లాలో పల్లెవెలుగు, ఆల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ సర్వీసుల కింద 190 బస్సుల్లో మాత్రమే రాకపోకలకు అవకాశం ఉందని తెలిపారు. జీరో టిక్కెట్ జారీ చేయడానికి ఇప్పటికే టిమ్ మిషన్లలో సాఫ్ట్‌వేర్ అప్‌లోడ్ చేశాం. ఆగస్టు 15వ తేదీ మధ్యాహ్నం నుంచి అన్ని నియోజక వర్గాల్లో ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో ఉచిత బస్సు ప్రయాణాలు ప్రారంభం అవుతాయి. మహిళలు ఆధార్, రేషన్ కార్డు, ఇతర ప్రభుత్వ గుర్తింపు పత్రాలను చూపి ప్రయాణం చేయవచ్చు. ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్టు తెలిపారు.

ఆశలు.. వెల్లివిరిసేలా..

ఆశా వర్కర్లపై కూటమి ప్రభుత్వం వరాల జల్లు



- పూర్తి వేతనంతో కూడిన 6 నెలల ప్రసూతి సెలవులు.. ఇకపై 62 ఏళ్ల వరకు విధులు
- రిటైరైనా నెలకు రూ.5 వేలు గ్రాట్యుటీ
- ఉమ్మడి పశ్చిమ జిల్లాలో మూడు వేల మందికి పైగా ఆశాలు

ఏలూరు అర్బన్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి):పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో మాతా శిశు సంరక్షణ, జాతీయ ఆరో గ్య కార్యక్రమాల అమలు, ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవాలు పెంచడం, సీజనల్ వ్యాధులు, ప్రాణాంతక వ్యాధులపై ప్రజల్లో అవగాహన, తదితర కీలకమైన వైద్య ఆరోగ్య సేవలను అందించే ఆశా వర్కర్లపై రాష్ట్ర ప్రభుత్వం వరాల జల్లు కురిపించింది. ఈ మేరకు జీవో 94 ఉత్తర్వులను వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ప్రత్యేక ముఖ్య కార్య దర్శి ఎం.టి.కృష్ణబాబు మంగళవారం విడుదల చేశారు. తాజా ఉత్తర్వులతో ఏలూరు జిల్లాలో పనిచేస్తున్న 1756 మంది ఆశా వర్కర్లకు, పశ్చిమ గోదావరి జిల్లాలో పని చేస్తున్న 1330 మందికి నేరుగా ప్రయోజనం లభిస్తుంది. వీరితోపాటు కొద్దిరోజుల్లో కొత్తగా విధుల్లో చేరనున్న ఏలూ రు జిల్లాలో మరో 55 మందికి, పశ్చిమలో ఇంకో 60 మం దికి తొలి రోజు నుంచే ఈ ప్రయోజనాలు అందనున్నాయి.

ఇవీ వరాలు

ఆశా వర్కర్లకు ఇప్పటి వరకు లేని ప్రసూతి సెలవు (మెటర్నిటీ లీవులు)లను ఇకపై 180 రోజులు(6 నెలలు) పూర్తి వేతనంతో ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే ఈ వెసులుబాటు రెండు కాన్పుల వరకే పరిమి తం. జిల్లాలో ప్రస్తుతం పనిచేస్తున్న ఆశా వర్కర్లలో అత్య ధికులు దాదాపు 2010లో నియమితులైన వారే కావడంతో, వీరిలో మెటర్నిటీ లీవు సదుపాయాన్ని వినియోగించుకునే అవకాశం ఉండకపోవచ్చునని ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. ఇక తొలిసారిగా ఆశా వర్కర్లకు గరిష్ట ఉద్యోగ కాలాన్ని 62 సంవత్సరాలుగా ప్రకటించారు. ఈ ఏడాది మార్చి 6న నిర్వహించిన ఛలో విజయవాడ సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు 62 సంవత్సరాల ఉద్యోగ కాల పరిమితి నిర్ణయాన్ని తీసుకోగా, ఎప్పటి నుంచి అమలు చేయనున్నారో స్పష్టత రావాల్సి ఉంది. ఒకవేళ ఈ ఏడాది ఏప్రిల్ నుంచి తాజా జీవో అమల్లోకి వచ్చినట్టుగా ప్రభుత్వం ప్రకటిస్తే, ఈలోగా విధుల నుంచి వైదొలగిన వారంతా ఆటోమేటిక్‌గా పునర్నియామకాలు పొందవచ్చు నని భావిస్తున్నారు. ఆశా వర్కర్లకు నెలకు రూ.10 వేలు గౌరవ వేతనంగా చెల్లిస్తున్నారు. ఇందులో రూ.7,200ను రాష్ట్ర ప్రభుత్వం, మిగతా రూ.2,800ను కేంద్ర ప్రభుత్వం ఎన్‌హెచ్‌ఎం స్కీం ద్వారా ఆశా వర్కర్ల బ్యాంకు ఖాతాలకు నెలనెలా వేర్వేరుగా జమ చేస్తున్నాయి.

ఆశా వర్కర్ ఉద్యో గ విరమణ తర్వాత ఆర్థిక భద్రత కోసం గౌరవ వేతనంలో సగం మెత్తాన్ని అంటే కొత్తగా గ్రాట్యూటీని నెలకు రూ.5 వేలు చొప్పున గరిష్ఠంగా రూ.1.50 లక్షలను ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయిం చింది. కాగా గ్రాట్యూటీ చెల్లింపునకు కనీస సర్వీసు కాలాన్ని ప్రామాణికంగా పెడతారా లేక అందరికీ వర్తింప జేస్తారా అనే దానిపై స్పష్టత రావాల్సి ఉంది. గ్రాట్యూటీ చెల్లించే అతి కొద్ది రాష్ట్రాల సరసన తాజా ఉత్తర్వులతో ఆంధ్రప్రదేశ్ చేరినట్టయిందని ఏపీ ఆశా వర్కర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు పోశమ్మ హర్షం వ్యక్తం చేశారు. రిటైర్మెంట్ 62 ఏళ్లుగా నిర్ణయిస్తూ వెలువరించిన జీవో ప్రయోజ నాలు ఎప్పటి నుంచి అమల్లోకి వచ్చినట్టుగా పరిగణిస్తారో ప్రభుత్వాన్ని వివరణ అడుగుతామన్నారు.

వర్షాలతో సార్వాకు ఊపు

ఏలూరుసిటీ, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ఉత్తర కోస్తాలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం కారణంగా జిల్లాలో రెండు రోజులుగా అక్కడక్కడా వర్షాలు కురుస్తున్నాయి. మందగించిన నైరుతి రుతుపవనాలు ఇప్పుడిప్పుడే పుంజుకుంటున్నాయి. బుధవారం ఉత్తర కోస్తాను అనుకుని బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనుందని ఇప్పటికే వాతావరణ శాఖ హెచ్చరికలు జారీచేసింది. ఈ అల్పపీడనం కారణంగా ఈనెల 16వ తేదీ వరకు వర్షాలు కురుస్తాయని చెబుతున్నారు. మంగళవారం జిల్లాలోని పలు ప్రాంతాల్లో వర్షాలు కురిశాయి. గడచిన 24 గంటల్లో జిల్లాలోనే అత్యధికంగా ఏలూరు రూరల్ మండలంలో 55 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ద్వారకా తిరుమలలో 35, ఆగిరిపల్లి 34.6, కామవరపుకోట 26.2, టి.నరసాపురం 25.2, చింతలపూడిలో 23 మి.మీ వర్షపాతాలు నమోదయ్యాయి. వర్షాలు లేక ఇబ్బందులు పడుతున్న రైతులు వాతావరణ శాఖ ప్రకటనలతో సార్వా పనులు ఊపందుకుంటాయని చెబుతున్నారు.

(ఏలూరు-ఆంధ్రజ్యోతి)

ఏలూరు నగరం పరిశుభ్రంగా దుమ్ము, దూళి రహితంగా ఉంచేందుకు నేషనల్ క్లీన్ ఎయిర్ మిషన్ (ఎన్‌క్యాప్) నిధులు ఉపకరిస్తున్నాయి. ఏలూరులో దుమ్ము, దూళి కణాలు ప్రమాద రహిత స్థాయిలో లేనప్పటికీ పదేళ్లలో ఈ శాతాన్ని మరింత తగ్గించాలన్న లక్ష్యంతో సాగుతున్నారు. 60 శాతంపైన గాలిలో దుమ్ము, దూళి కణాలుంటే ఆరోగ్య పరమైన సమస్యలు తలెత్తుతాయని పొల్యూషన్ కంట్రోల్ బోర్డు నివేదికలు పేర్కొంటున్నాయి. ఏలూరు నగరంలో 58 శాతం దుమ్ము, దూళి కాలుష్యం ఉన్నట్లు చెబుతున్నారు. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ 2019లో సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు (సీపీసీబీ)ను నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రామ్ (ఎన్‌సీఏపీ) కార్యక్రమం చేప ట్టాలని ఉత్తర్వులు జారీ చేసింది. అందులో భాగంగా నగరాల్లో కాలుష్య కారకాలను తగ్గించడంపై ఆయా నగరాల్లో కార్పొరేషన్, పొల్యూషన్ కంట్రోల్‌బోర్డు, ఇతరశాఖల సమన్వయంతో పలు పనులు చేపట్టాలని నిర్దేశించింది. 2024-25 సంవత్సరానికి 2 కోట్ల 29 లక్షల నిధులను రోడ్లు నిర్మాణాలకు మంజూరు చేసింది. నగరంలో తంగెళ్లమూడి వంతెన నుంచి చింతలపూడి రోడ్డు వయా గౌరీశంకర్ టెంపుల్ నుంచి జంగారెడ్డిగూడెం రోడ్డు వరకు రూ.కోటీ 31 లక్షలతో అభివృద్ధి చేయడంతో కొంత దుమ్ము, దూళి శాతం తగ్గింది. ఇందులో ట్రాఫిక్ ద్వారా కూడా దుమ్ము, దూళి కణాలను తగ్గించేందుకు ఇంటిగ్రేటెడ్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ (ఐటీఎంఎస్)ను ప్రధానంగా పాత బస్టాండ్, ఫైర్‌స్టేషన్, కండ్రిగూడెం సెంటర్లలో ఏర్పాటు చేస్తారు. రూ.35 లక్షల వ్యయంతో ఏర్పాటు చేయాల్సి ఉంది. ఇవి కాకుండా 50 డివిజన్లలో కాలుష్యం తగ్గించేందుకు వివిధ రకాల మొక్కలు పెద్ద ఎత్తున నాటారు. పోణంగి డంపింగ్‌యార్డు స్థలంలోనే వేలల్లో మొక్కలు నాటారు. కోర్టు ఆవరణలో ఆన్‌లైన్ ద్వారా గాలి నాణ్యతను కొలిచే యంత్రం ఏర్పాటు చేశారు. ఇది వినియోగంలోకి తేనున్నారు. ఇది ఎప్పటికప్పుడు గాలిలోనే విషకారకాలు, ఇతర ఇబ్బందులుంటే ముందస్తు హెచ్చరికలను నమోదు చేస్తుంది. దీనికి సాంకేతికపరంగా వివిధ అనుమతులు రావాల్సి ఉంది. రానున్న కాలంలో నగరంలోని వివిధ రోడ్లను డ్రెయిన్ల వరకు రోడ్లను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. కృష్ణా కాల్వ గట్ల వెంబడి ఆశ్రమం నుంచి పంపుల చెరువు పరిసరాల వరకు రెండువైపులా కాల్వగట్లు వెడల్పు చేయాలని ప్రతిపాదనలు సిద్ధం చేశారు. దీనికి పరిపాలనామోదం రావాల్సి ఉంది.



క్లీన్ ఏలూరు

- ఎన్ క్యాప్ నిధులతో కాలుష్య కారకాల తగ్గింపు
- తొలి విడతగా రూ.2 కోట్ల 29 లక్షలతో మొక్కల పెంపకం
- రెండో విడతకు రూ.6 కోట్లతో రోడ్ల విస్తరణ



డంపింగ్ యార్డులో సిద్ధంగా ఉన్న మొక్కలు

ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు

గాలిలో కాలుష్య కారకాలను మరింత తగ్గించే దిశగా పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, కార్పొరేషన్, ట్రాఫిక్ విభాగాలు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాయి. మే 22 నుంచి జూన్ 4 వరకు, ఐదున ప్రపంచ పర్యావరణ దినోత్సవం ఇప్పటికే పూర్తి చేశారు. రానున్న సెప్టెంబర్‌లో 1 నుంచి 6వ తేదీ వరకు ఎయిర్ పొల్యూషన్ అవేర్‌నెస్ వీక్, 7న స్వచ్ఛ వాయు దివస్, 21న జీరో ఎమిషన్ డేలను నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందించారు. ఏలూరులో గాలిలో దుమ్ము, దూళి కాలుష్యం హానికరం కాకపోయినప్పటికీ, ప్రజలు అనారోగ్యం పాలుకాకుండా కలెక్టర్ వెట్రిసెల్వి ఆధ్వర్యంలో ముందస్తు ప్రణాళిక అమలు చేస్తున్నట్లు పీసీబీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వెంకటేశ్వరరావు తెలిపారు.

సేవలు దూరం !



- మూడు నెలలుగా గర్భిణులు, బాలింతలకు అందని పీఎంఎంవీవై, జీఎస్‌వై సాయం
- నిర్వహణ బాధ్యతలు ఆరోగ్య శాఖ నుంచి ఐసీడీఎస్‌కు బదిలీ
- అంగన్‌వాడీలు స్మార్ట్‌ఫోన్‌లు ప్రభుత్వానికి అప్పగించడంతో నిలిచిన నమోదు

అత్తిలి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి):గర్భిణులు, బాలింతల్లో రక్తహీనత తగ్గించి, పోషకాహారం అందించాలన్న సంకల్పంతో అమలు చేస్తున్న కేంద్ర పథకాలు ప్రధాన మంత్రి మాతృత్వ వందన యోజన (పీఎంఎంవీవై), జననీ సురక్ష యోజన (జీఎస్‌వై) నిర్వహణ అయోమయంలో పడింది. ఈ పథకాల నిర్వహణ బాధ్యతలను ఇటీవల వైద్య ఆరోగ్య శాఖ నుంచి ఐసీడీఎస్‌కు అప్పగించడంతో ఇది సమస్యాత్మకంగా మారింది. ఈ ఏడాది మే వరకు వీటిని ఆరోగ్య శాఖ నిర్వహణ బాధ్య తలు చూసింది. ఆగస్టు ఒకటో తేదీ నుంచి ఐసీడీఎస్‌కు అప్పగించారు. మధ్యలో జూన్, జూలై నెలల్లో గర్భిణుల నమోదు నిలిచిపో యింది. అదనంగా తమకు ఆరోగ్య శాఖకు సంబంధించిన పనిని చేర్చడంతో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని అంగన్‌వాడీ కార్యకర్తలు ఆన్‌లైన్ సేవలు నిలిపివేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించిన పోషణ ట్రాకర్, బాల సంజీవనితోపాటు కిశోర్ వికాస్, మిషన్ వాత్సల్య సఖి గ్రూపుల సమాచారం పలు రకాల యాప్‌లలో నమోదు చేస్తున్నారు. సాంకేతిక పరిజ్ఞానానికి గత వైసీపీ ప్రభుత్వం 2 జీబీ ర్యామ్, 4జీ నెట్‌వర్క్‌లో వున్న సెల్‌ఫోన్లను అందించింది. ఇవన్నీ మూలకు చేరాయి. వీటిని అంగన్‌వాడీ కార్యకర్తలు ఐసీడీఎస్ కార్యాలయాల్లో అప్పగించి ఆన్‌లైన్ సేవలు నిలిపివేశారు. ప్రభుత్వం 5జీ నెట్‌వర్క్‌తో కొత్త ఫోన్లు ఇచ్చే వరకు ఎలాంటి యాప్‌లు నిర్వహించలేమని తేల్చి చెప్పారు. అయితే గర్భిణులు, బాలింతలకు సంబంధించి ఆ రెండు నెలల వివరాలు యాప్‌లో ఎవరు నమోదు చేయాలి ? నిధుల పరిస్థితి ఏమిటన్న దానిపై స్పష్టత కరువైంది. వాస్తవానికి ఈ రెండు పథకాలకు సంబంధించి మూడు విడతల్లో ఆరు వేల రూపాయల ప్రోత్సాహకాలను లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తారు. ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లా అంగన్‌వాడీ కేంద్రాల్లోని కార్యకర్తలకు ప్రత్యేక లాగిన్‌లు ఇచ్చి గర్భం దాల్చగానే యాప్‌లో నమోదు చేయాల్సి వుంది. ప్రస్తుతం ఇది ఆగిపోవడంతో వందలాది మంది లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



ఆరేళ్ల క్రితం మిస్సింగ్

దొరికిన భార్య, ఇద్దరు పిల్లలు

కుటుంబానికి అప్పగింత



యూరియా ఏదయా ?

ఎరువుల దుకాణాల వద్ద రైతులు పడిగాపులు 7

అవయవ దానంతో పునర్జన్మ



'పరోపకారార్థం ఇదం శరీరం' అని మన పెద్దలు ఏనాడో చెప్పారు. మరణించిన తర్వాత శరీరం కట్టెల్లో కాలిపోయి లేదా మట్టిలో కలిసిపోవడం వల్ల మనిషి జీవితానికి అర్థం ఉండదు. మరణానంతరం మన శరీరంలో అవయవాలతో మరో కొంతమందిని మృత్యువుకి చేరువ కాకుండా కాపాడిన వారికి పునర్జన్మ ప్రసాదించడమే మానవ జన్మకు సార్థకం. మరణానంతరం ప్రజల హృదయాలలో చిరంజీవులుగా మిగిలిపోయేవారు ప్రాణదాతలు. అవయవ దానంపై ఆగస్టు 13వ తేదీ జాతీయ అవయవదాన దినోత్సవం సందర్భంగా ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.
పోలవరం, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి)

ఒకరికి రక్తదానం చేయడం ద్వారా మరో ముగ్గురికి ప్రాణదానం చేయవచ్చనే విషయం అందరికీ తెలిసిందే. కానీ ఒక మనిషి అవయవ దానం వల్ల ఎంతోమందికి పునర్జీవం ఇవ్వవచ్చునని ఎంతోమంది అవయవ దాతలు ప్రత్యక్షంగా నిరూపించారు. అవయవదానం అనేది మరణించిన లేదా బ్రెయిన్‌డెడ్ వంటి క్లిష్టమైన పరిస్థితుల్లో మరణించడానికి సిద్ధం ఉన్న వ్యక్తుల నుంచి అవయవాలు వేరొకరకి అమర్చడం. దీని వల్ల శరీరంలో ఆయా అవయవాలు విఫలమై రోగగ్రస్తులైనవారు పునర్జీవులవుతారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం జీవనదానం కార్యక్రమం పేరిట కొన్ని మార్గదర్శకాలు రూపొందించింది.

అవయవదానం రెండు రకాలు..

1. **సజీవ దానం..** బతికున్నవారు ఆరోగ్యంగా ఉండి అవయవాన్ని లేదా అవయవంలో కొంత భాగాన్ని దానం చేయండం. వీటిలో రక్తదానం, కాలేయం (లివరు)లో కొంతభాగం దానం చేయడం. మూత్రపిండం (కిడ్నీ) వంటివి. ఇవి చేసిన తర్వాత కూడా దాత ఆరోగ్యంగా జీవించవచ్చు.
2. **జీవన్మృతి దానం (కెడావర్) :** ఈ దానంలో మరణానంతరం అవయవాలు దానం చేయడం. మరణించిన వ్యక్తి నుంచి అవయవదానం చేయడం అంటే శరీరంలో ఏదో ఒక ప్రధాన అవయవ లోపంతో మృతి చెందడం లేదా ప్రమాదవశాత్తు బ్రెయిన్ డెడ్ కావడం వంటి కారణాల వల్ల మరణం సంభవిస్తే మృతి చెందిన వ్యక్తి దేహంలో మరొక వ్యక్తి జీవనానికి ఉపయోగపడే అవయవాలను దానం చేయడం.

దానం చేయగల అవయవాలు..

మనిషి మరణానంతరం తన శరీరం నుంచి 200 అవయవాలు, కణజాలాన్ని దానం చేయవచ్చు. కళ్లు, గుండె, కాలేయం, మూత్రపిండాలు, ఊపిరితిత్తులు, క్లోమం, పెద్దప్రేగు, చిన్న ప్రేగులు, ఎముకలు, ఎముకలోని మూలు గలను దానం చేయవచ్చు. ఒక వ్యక్తి చనిపోయిన తర్వాత సత్వరమే స్పందించి దానానికి చర్యలు తీసుకుంటే సగటున ఏడుగురికి జీవితం ఇవ్వవచ్చు. సహజ మరణం తర్వాత ప్రాణవాయువు (ఆక్సిజన్) సరఫరా నిలిచిపోవడంతో శరీరంలో అవయవాలు పనికి రాకుండా పోతాయి. కేవలం కంటి కార్నియా, చర్మం, ఎముక, గుండె కవాటాలు, రక్త నాళాలు వంటి కణజాలాలు ఉపయోగపడతాయి. బ్రెయిన్ డెడ్ వ్యక్తుల నుంచి గుండె, ఊపిరితిత్తులు, మూత్రపిండాలు, కాలేయం, క్లోమం, ప్రేగులు లాంటి అవయవాలను సేకరించవచ్చు.



చర్మదానం..

బ్రెయిన్ డెడ్ వ్యక్తుల దేహాల నుంచి చర్మం సేకరించి కాలిన గాయాలకు అమర్చే గ్రాఫ్టింగ్ ప్రక్రియ ద్వారా కొత్త జీవితం అందిస్తున్నారు. సేకరించిన చర్మాన్ని ఐదేళ్ల వరకు స్కిన్ బ్యాంకులలో భద్రపరచి ఉపయోగించుకునే వీలుంది. తక్కువ గాయాలతో వచ్చిన బాధితులకు వారి శరీరంలో వీపు, తొడల నుంచి చర్మాన్ని తీసి కాలిన చోట అతికించి చికిత్స చేస్తారు. తీవ్ర గాయాలైతే స్కిన్ బ్యాంకులోని చర్మంతో రోగికి తాత్కాలిక జవ రక్షణ కవచంలా గ్రాఫ్టింగ్ చేస్తారు.

నేడు జాతీయ అవయవ దాన దినోత్సవం

ఎప్పుడు సేకరిస్తారంటే..

బతికి ఉన్నప్పుడు సజీవ దానం 18 ఏళ్లు నిండిన ఎవరైనా చేయవచ్చు. జీవన్మృతులు (బ్రెయిన్‌డెడ్) విషయంలో లింగ భేదం, వయోభేదం లేదు. చనిపోయిన తర్వాత అవయవాల మార్పిడి గంటల్లో జరిగిపోవాలి. గుండె ఆగి చనిపోతే కళ్లు, గుండె, కవాటాలు వంటి వాటిని 6 నుంచి 24 గంటల్లో సేకరించవచ్చు. రోడ్డు ప్రమాదాల్లో చనిపోయిన కేసుల్లో ఎక్కువగా బ్రెయిన్‌డెత్‌గా ప్రకటిస్తారు. వీరి నుంచి గుండె నాలుగు గంటలు, కాలేయం 8 నుంచి 10 గంటలు, మూత్ర పిండాలు 24 గంటల్లో సేకరించాల్సి ఉంటుంది.

- బతికుండగా మూత్రపిండం వంటి దానం చేసినవారు క్రమం తప్పకుండా వైద్యులను సంప్రదించడం, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవరుచుకోవడం చేయాలి. వైద్యుల సలహాలపై మందులు క్రమం తప్పకుండా వాడాల్సి ఉంటుంది.

దాతల నమోదు ఇలా..

అవయవదానం చేయాలనుకునే వారు నేషనల్ ఆర్గాన్ అండ్ టిష్యూ, ట్రాన్స్ ప్లాంట్ అసోసియేషన్‌లో లేదా ప్రాంతీయ స్థాయిలో జీవనదాన్ కార్యక్రమంలో తమపేర్లను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చు. దీనిలో ప్రత్యేక నంబరుతో దాతకు గుర్తింపు కార్డు వస్తుంది. ఈ నమోదు సంగతి దాత తమ కుటుంబ సభ్యులకు ఆప్తమిత్రులకు తప్పనిసరిగా తెలియజేయాలి.

అవయవదానంపై అవగాహన కార్యక్రమాలు

2017లో ఫ్రాన్స్ అవయవదానాన్ని తప్పనిసరి చేసింది. ఇష్టం లేదని ప్రభుత్వానికి ముందు తెలియజేయకపోతే వైద్యులు అవయవాలు సేకరిస్తారు. మిగిలిన దేశాలు ఈ పద్ధతిని అనుసరిస్తున్నాయి. భారతదేశంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవగాహన పెంచడానికి నమోదు వంటి అవగాహన కార్యక్రమాలు చేపట్టింది. పలు రకాల అపోహల వల్ల కుటుంబ సభ్యులు ముందుకు రాకపోవడం వల్ల దేశంలో అవయవ దాతల కొరత ఏర్పడింది. 1994లో మానవ అవయవాలు, కణజాలాల మార్పిడి చట్టం తెచ్చారు. 2011లో దానికి సవరణలు చేశారు. అవయవ, కణజాల మార్పిడి సంస్థ ఎన్ఓటీటీఓ ఈ ప్రక్రియలను పర్యవేక్షిస్తుంది. తెలుగు రాష్ట్రాల్లో జీవన్‌దాన్, ఇంకా మరి కొన్ని స్వచ్ఛంద సేవా సంస్థలు దశాబ్ద కాలంగా అవయవదానంపై పనిచేస్తున్నాయి.

- కేంద్రం ప్రభుత్వం అవయవాలను త్వరితగతిన తరలించేందుకు గ్రీన్ కారిడార్ ఏర్పాటుకు ఆదేశాలు జారీ చేసింది. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు ప్రభుత్వాలు దాతల అంత్యక్రియలను ప్రభుత్వ లాంఛనాలతో జరపాలని నిర్ణయించింది. దీనికి జిల్లా కలెక్టర్ లేదా ప్రభుత్వ ప్రతినిధి హాజరవుతారు.

ఇద్దరు అంధులకు నేత్రదానంతో సంతృప్తి



నా తండ్రి సముద్రాల కేశవరావు మరణానంతరం నేత్రాలను దానం చేశారు. ఆయన మరణానంతరం సమాచారం ఇవ్వడంతో వైద్య సిబ్బంది కార్నియాలను సేకరించారు. అవయవదానం చేయడం వల్ల మరో ఇద్దరు అంధులకు నేత్రదానం చేయడం, సహాయపడడం సంతృప్తిగా ఉంది.

- సముద్రాల సాయికృష్ణ, సీపీఎం నాయకుడు, పోలవరం

గణాంకాలు ఇలా..

నేషనల్ ఆర్గాన్ టిష్యూ ట్రాన్స్‌ప్లాంట్ ఆర్గనైజేషన్ (ఎన్‌వోటీటీఓ) ప్రకారం 2014 సంవత్సరంలో 6,916 అవయవమార్పిడి శస్త్రచికిత్సలు జరిగాయి. 2022 నాటికి 16,000కు చేరాయి. 83 కేసులలో అవయవాలను జీవించి ఉన్న వ్యక్తుల నుంచి సేకరించారు. మరణించిన దాతలు 2014లో 408 మంది, 2023లో 1000కి పైగా ఉన్నారు. సినీ నటుడు జగపతిబాబు 2022 ఫిబ్రవరి 12న తన పుట్టినరోజు సందర్భంగా అవయవదానానికి సంతకం చేశారు. వందకు పైగా ఆయన అభిమానులు కూడా ప్రమాణపత్రాలపై సంతకాలు చేశారు.

ఏపీ బెస్ట్ అథ్లెటిక్‌గా 'సాకిల్‌బాబు'

రాష్ట్రస్థాయి పోటీలలో ఏలూరు కుర్రాడికి బంగారు పతకం



సాకిల్‌బాబును అభినందిస్తున్న కోచ్ ప్రసాద్

ఏలూరురూరల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): 36వ ఏపీ స్టేట్ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలు ఈనెల 9,10,11 తేదీలలో బాపట్ల జిల్లా చీరాలలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలలో ఏలూరు కుర్రాడు అత్యంత ప్రతిభ కనబరచి బంగారు పతకంతో పాటు బెస్ట్ అథ్లెటిక్‌గా ఎంపిక య్యాడు. అండర్-18 బాలుర విభాగంలో 100 మీటర్ల పరుగు పందెంలో కేఎస్ఎస్ సాకిల్‌బాబు వేగంగా పరిగెత్తి బంగారు పతకం కైవసం చేసుకున్నాడు. అదేవిధంగా ఏపీ స్టేట్ బెస్ట్ అథ్లెటిక్‌గా అవార్డు అందుకున్నాడు. ఈ సందర్భంగా లక్ష్య అథ్లెటిక్ కోచ్ దేవరపల్లి ప్రసాద్ వద్ద శిక్షణ పొందుతున్న సాకిల్‌బాబు ఇప్పటికే జాతీయ, రాష్ట్రస్థాయిల్లో ప్రతిభ చాటుతూ పతకాలు సాధిస్తున్నాడు. బెస్ట్ అథ్లెటిక్‌గా ఎంపికైన సందర్భంగా కోచ్‌లు, నగర ప్రముఖులు అభినందించారు.

వైద్య పరిశోధనలు జాతీయ ప్రయోజనాలకు దోహదపడాలి

ఏలూరు అర్బన్,ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి) : వైద్య పరిశోధనలు జాతీయ ప్రయోజనాలకు దోహదపడేలా ఉండాలని సౌదీ అరేబియాలోని మెడికల్ అకాడమీ ప్రొఫెసర్, రీసెర్చ్ కో-ఆర్డినేటర్ డాక్టర్ కె.చంద్రశేఖర్ సూచించారు. 'ప్రపంచ కుటుంబ ఆరోగ్యం-జీవవైద్యశాస్త్రంలో నూతన ఆవిష్కరణలు' అనే అంశంపై మంగళవారం ఏలూరు సెయింట్ థెరిస్సా మహిళా కళాశాలలో అంతర్జాతీయ సదస్సు నిర్వహించారు. ము ఖ్యఅతిథిగా ఆయన మాట్లాడుతూ వైద్య పరిశోధనలో పురోగతి, నూతన చికిత్సా విధానాలు, నివారణ చర్యలు, ఆరోగ్యసమస్యలపై అవగాహన, వ్యక్తిగత శ్రేయస్సు తదితర అంశాలపై మాట్లాడారు. అనంతరం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పీ.జే.అమృతం, జ్యూరిచ్‌కు చెందిన డాక్టర్ వినయ్‌భూషణ్, అమెరికాకు చెందిన డాక్టర్ వీరమాచనేని వాణి, డాక్టర్ విజయ భూషణం ప్రసంగించారు. పలు దేశాలనుంచి విచ్చేసిన విద్య, వైద్య, పరిశోధన రంగాలకు చెందిన నిపుణులు తమ పరిశోధనా పత్రాలను సమర్పించారు. డెంటల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ స్లీవరాజు, కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ మెర్సీ అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.



ఉంగుటూరు మార్కెట్ కమిటీకి సేకరించిన స్థలం (ఇన్‌సెట్‌లో) చేబ్రోలులో అద్దె భవనంలో ఉన్న మార్కెట్ కమిటీ కార్యాలయం

28 ఏళ్లుగా అద్దె భవనంలోనే 'ఉంగుటూరు ఏఎంసీ'

- స్థలమున్నా ముందుకు రాని కాంట్రాక్టర్లు
- కూటమి పాలనలోనైనా నూతన భవనం ఏర్పాటయ్యేనా ?

ఉంగుటూరు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ఉంగుటూరు మార్కెట్ కమిటీ ఏర్పాటై ఇరవై ఎనిమిదేళ్లైనా నేటికి అద్దె భవనంలోనే కమిటీ భనాలు మగ్గుతుండడంతో ప్రభుత్వ భవనాలు ఎప్పుడు సమకూరేనో అని రైతులు, ప్రజా ప్రతినిధులు ఎదురు చూస్తున్నారు. అప్పట్లో తాడేపల్లిగూడెం నుంచి 1997లో ఉంగుటూరు మార్కెట్ కమిటీ విడిపోగా అప్పటి నుంచి సాంకేతిక ఇబ్బందుల వల్ల ఉంగుటూరు మార్కెట్ కమిటీకి చేబ్రోలు కేంద్రంగా నల్లజర్ల, నిడమర్రు, గణపవరం మండలాలతో నూతన కమిటీగా ఏర్పాటైంది. తొలి చైర్మన్‌గా కాజ సోమశేఖర్, తాతిన సత్యనారాయణ, పాతూరి విజయకుమార్, కొండ్రెడ్డి సర్వేశ్వరరావు, అనంతరం 2019 నుంచి మరడా మంగారావు, అతని భార్య రమావతి చైర్మన్‌లుగా పనిచేశారు. అయితే పాతూరి విజయకుమార్ ఉన్న సమయంలో తన బంధువులనుంచి మార్కెట్ కమిటీకి కావలసిన అనువైన స్థలాన్ని సేకరించినా పలుమార్లు టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో భవనాల నిర్మాణానికి మోక్షం కలుగ లేదు. ఈ మార్కెట్ కమిటీ ఆదాయం ఏడాదికి రూ.4 నుంచి 6 కోట్లు ఉంటుంది. ఇప్పటికైనా నూతన భవనాల నిర్మాణంపై కూటమి నాయకత్వం స్థానిక ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు నేతృత్వంలో నిర్మాణానికి అంకురార్పణ జరుగుతుందో లేదోనని రైతులు, ప్రజా ప్రతినిధులు ఆశగా ఎదురు చూస్తున్నారు.

సొంత భవనం నిర్మాణానికి కృషి చేస్తా..



ఎమ్మెల్యే ధర్మరాజుతో పాటు ప్రజాప్రతినిధులతో చర్చించి మార్కెట్ కమిటీకి కావాల్సిన సొంత భవవనం నిర్మాణానికి కృషి చేస్తా. నిధులు వెచ్చించి మౌలిక సదుపాయాల కల్పనకు, రైతులకు కావాల్సిన పంత రహదారుల అభివృద్ధికి కృషి చేస్తా.

- కారేటి జ్యోతి, ఉంగుటూరు మార్కెట్ కమిటీ చైర్ పర్సన్



తణుకులో బ్యాడ్మింటన్ ఆడుతున్న క్రీడాకారులు

'ఒలింపిక్స్'లో పతకాలే లక్ష్యం

జాతీయ క్రీడా దినోత్సవంలో బ్యాడ్మింటన్ క్రీడాకారుల ప్రతిభ

తణుకు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి):ఒలింపిక్స్‌లో పతకాలు సాధించడమే లక్ష్యంగా పలువురు క్రీడాకారులు అత్యంత ప్రతిభ కనబరుస్తున్నారు. ఇప్పటికే పలు సందర్భాల్లో రాష్ట్రస్థాయి, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో జరిగిన పలు పోటీలలో తలపడి పతకాలు సాధిస్తున్నారు. లక్ష్య సాధన కోసం కీడ్రాకారులు విశేషంగా కృషి చేస్తున్నారు. జాతీయ క్రీడా దినోత్సవం పురస్కరించుకుని తణుకు ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాలలో మూడు రోజులుగా జరిగాయి. ఆయా పోటీలలో పలువురు క్రీడాకారులను ఎంపిక చేశారు. చివరి రోజుల పలువురు బ్యాడ్మింటన్ క్రీడాకారులను ఆంధ్రజ్యోతి పలుకరించింది.

ఒలింపిక్స్‌లో మెడల్ సాధిస్తా : ఎం.మనోజ్ఞ



ఒలింపిక్స్ పోటీలలో పాల్గొని మెడల్ సాధించడమే లక్ష్యం. తణుకు ఎస్‌కేఎస్‌డీ జూనియర్ కళాశాలల్లో ఇంటర్ చదువుతున్నా. నాన్న శ్రీరామ్ మెడికల్ రిప్రజెంటేటివ్‌గా పనిచేస్తున్నారు. ఇప్పటివరకు జాతీయస్థాయిలో కోల్‌కత, విజయవాడ, హైదరాబాద్, బెంగళూరు, గోవా, హరియాణాతోపాటు రాష్ట్రస్థాయిలో విజయవాడ, హైదరా బాద్‌లో జరిగిన మిక్స్‌డ్ డబుల్స్‌లో బ్రౌంజ్, సిల్వర్ మెడల్స్ సాధించా.

ఒలింపిక్స్‌లో ఆడతా : ఎ.త్రిలోక్



ఇండియా తరపున ఒలింపిక్స్‌లో ఆడాలని లక్ష్యంగా పెట్టుకున్నా. తణుకు ఇంపల్స్ జూనియర్ కాలేజీలో సెకండ్ ఇంటర్ చదువుతున్నా. నాన్న లక్ష్మణప్రసాదు మెడికల్ రిప్‌గా పనిచేస్తున్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలో జరిగిన పోటీల్లో పాల్గొన్నా. జాతీయస్థాయిలో అండర్-17 గుజరాత్‌లో నేషనల్ టీమ్ ఈవెంట్‌లో సెకండ్ ప్లేస్ సాధించా. అండర్-19లో మధ్యప్రదేశ్‌లో టీమ్ ఈవెంట్‌లో మూడోస్థానం, జైపూర్‌లోని అండర్-15 డబుల్స్ తృతీయస్థానం సాధించా.

మంచి ఉద్యోగం సాధిస్తా.. : ఎ.త్రిలోచ్



ఇండియా తరపున ఒలింపిక్స్‌లో ఆడటమే తన లక్ష్యం. మానాన్న లక్ష్మణ ప్రసాదు మెడికల్ రిప్‌గా పనిచేస్తారు. తణుకులోని ఇంపల్స్ కాలేజిలో సెకండ్ ఇయర్ చదువుతున్నాను. జాతీయ స్థాయిలో అండర్-17 క్వార్టర్ ఫైనల్‌కు చేరాను. నెల్లూరులో అండర్-17లో డబుల్స్‌లో తృతీయ స్థానం సాధించాం.

జాతీయస్థాయిలో ఆడడమే లక్ష్యం : పి.సత్యగీతిక్



ఇండియా తరపున జాతీయ స్థాయిలో ఆడాలని లక్ష్యంగా పెట్టుకున్నా. అలంపురంలోని సరస్వతి స్కూలులో పదో తరగతి చదువుతున్నా. ఇప్పటివరకు జాతీయస్థాయిలో ఐసీఎస్‌సీ స్కూల్ గేమ్స్‌లో టీమ్ ఈవెంటులో ద్వితీయస్థానం సాధించాను. మరిన్ని పోటీల్లో పాల్గొని సత్తా చాటుతా.

ఎడమ చేతి వాటందారులు అత్యంత ప్రతిభావంతులు





నేడు లెఫ్ట్ హేండర్స్ డే

'కుడి ఎడమైతే పొరపాటు లేదోయ్' అని ఓ సినీ కవి చెప్పినట్టు మనిషికి వున్న రెండు చేతులూ ఒక్కటిగానే వుంటాయి. కానీ సమాజంలో ఏర్పడిన అలవాట్ల వల్ల రెండు చేతులలో కుడి చేతికి ప్రాముఖ్యత ఎక్కువగానూ, ఎడమ చేతికి తక్కువ ప్రాముఖ్యత ఇస్తూ పనులు చేస్తుంటారు. ఎడమ చేతితో చేసే పనులను అశుభంగానూ, శుభాలకు కుడి చేతిని ఉపయోగించడం ఆనవాయితీగా వుంటుంది. ఎడమ చేతితో రాసే వారిని, పనులు చేసే వారి పట్ల సమాజంలో కొంత న్యూనతా భావం ఉండడంతో కొంత నిర్లక్ష్యం ఏర్పడింది. కానీ ఎడమ చేతితో రాత అలవాటు ఉన్న వారిలో అనేక ప్రత్యేకతలు ఉన్నాయని నిపుణులు పేర్కొంటున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఎంతో మంది ప్రముఖులు ఎడమ చేతి వాటం గల వ్యక్తులు ఎంతో ఉన్నతంగా, విజయవంతంగా రాణించారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ఐక్యరాజ్య సమితి 1976, అగస్టు 13వ తేదీన లెఫ్ట్ హేండర్స్ డేగా ప్రకటించింది. దీనిని ప్రత్యేక దినోత్సవంగా నిర్వహిస్తుంది. దీనిపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

- తణుకు రూరల్, అగస్టు 12 (ఆంధ్రజ్యోతి) :

అన్ని రంగాల్లో అత్యంత ప్రతిభావంతులు



ఎడమ చేతి వాటం ఎందుకు కలిగివుంటారో అనే దానిపై ఇప్పటికీ పరిశోధనలు జరుగుతున్నాయి. కచ్చితమైన కారణాల కోసం పరిశోధనలు జరుగుతున్నాయి. జెనిటిక్స్, తల్లిదండ్రులలో ఒకరు ఎడమ చేతి వాటం కలిగి వుండడం, గర్భంలో ఉన్నప్పు డు పిండం అభివృద్ధి. సమయంలో కొన్ని హార్మోన్లకు గురికావడం, బ్రెయిన్ హెమి స్పియర్ డామినెన్స్, పర్యావరణ, సామాజిక కారణాల వల్ల ఎడమ చేతి వాటం అలవాటు ఏర్పడుతుంది. పలు కళల నుంచి సైన్స్ వరకు క్రీడల నుంచి రాజకీ యాల వరకు ఎడమ చేతి వాటం గల వ్యక్తులు మానవ చరిత్రలో చెరగని ముద్ర వేశారు.

- పెదపాటి గోపాలకృష్ణప్రసాద్, సైకాలజిస్ట్. వ్యక్తిత్వ వికాస నిపుణులు, తణుకు.

ప్రపంచ వ్యాప్తంగా ఎడమ చేతి వాటం గల వారు చాలా ప్రతి భావంతులుగా రాణించారు. వారిలో అరిస్టాటిల్, లియోనార్డ్ డావిన్సీ, ఆల్‌బర్ట్ ఐన్‌స్టీన్, మహాత్మాగాంధీ, బ్రిటన్ మాజీ ప్రధాని విన్‌స్టన్ చర్చిల్, అమెరికా మాజీ అధ్యక్షులు జార్జి బుష్, బరాక్ ఒబామా, మనదేశంలో ఝాన్సీ లక్ష్మీబాయి, మూడు సార్లు ప్రధానిగా వున్న నరేంద్ర మోదీ, పారిశ్రామికవేత్త రతన్‌టాటా, సినీ నటులు అమితాబ్‌బచ్చన్, మహానటి సావిత్రి, రజనీకాంత్, భారతీయ క్రికెట్ క్రీడాకారులు సునీల్ గవాస్కర్, సచిన్ టెండూల్కర్, సౌరవ్ గంగూలీ, గౌతమ్ గంభీర్, యువరాజ్ సింగ్, వినోద్ కాంబ్లీ, బ్యాడ్మింటన్ క్రీడాకారిణి జ్వాలా గుప్తా, తదితరులు తమ ఎడమ చేతి వాటంతోనే తమ క్రీడా నైపుణ్యం చాటి విజేతలుగా నిలిచారు.

ప్రపంచ జనాభాలో 12 శాతం వరకు..

ఎడమ చేతి వాటం కలిగిన వారు ప్రపంచ జనాభాలో సుమారు 10నుంచి 12శాతం వరకు ఉంటారని ప్రపంచ ఆరోగ్య సంస్థ తన నివేదికలో పేర్కొంది. వారిలో మొత్తం 98శాతం మంది తమ జీవిత కాలంలో వృత్తి వ్యాపారాల్లో విజేతలుగా నిలిచినట్టు విశ్లేషణలు పేర్కొంటున్నాయి. జన్యుపరమైన వాతావరణ పరమైన మార్పులతో పాటు 45 ఏళ్ల తర్వాత పుట్టిన బిడ్డలలో ఎడమ చేతి వాటం వస్తుందని వైద్య పరిశోధనలు పేర్కొంటున్నాయి. ఎడమ చేతి వాటం గల వ్యక్తులు నిత్య నూతనంగా వుంటూ ఎంతటి ఒత్తిడినైనా ఎదుర్కొగల శక్తిని కలిగివుంటారు. వీరి ఆలోచనలు నిత్య నూతనంగా వుంటాయి. వీరు ఏక కాలంలో ఎక్కువ పనులు చేసే సామర్థ్యం కలిగి వుంటారు. వీరు బొమ్మలు గీసేటప్పుడు అవి కుడివైపు అభిముఖంగా వుండేటట్టు గీస్తారు. బ్రెయిన్ స్ట్రోక్ వంటి ప్రమాదకర స్ట్రోక్స్ వచ్చినప్పుడు కుడి చేతి వాటం గల వ్యక్తుల కంటే ఎడమ చేతి వాటం గల వ్యక్తులు త్వరగా కోలుకుంటారు. సంగీతం, భాష, కళలు వంటి రంగాలలో ఎడమ చేతి వాటం వ్యక్తులు ఎక్కువగా రాణిస్తారు. వీరు కుడిచేతి వాటం గల వ్యక్తులు తయారు చేసిన వస్తువులను ఉపయోగించడం వల్ల ఎక్కువగా గాయాల పాలవుతారని ఒక అధ్యయనం ద్వారా తేలింది.

ఎడమ చేతికి శక్తి ఎక్కువ..



కుడి చేతి వాటం గల వ్యక్తుల కన్నా ఎడమ చేతి వాటం గల వ్యక్తులకు శక్తి ఎక్కువ. నాకు తెలిసినప్పటి నుంచి ఎడమ చేతితో రాయడం అలవాటైంది. చదువులో ఎం.ఏ, బీఎల్ వంటి పరీక్షలు, గ్రూప్-2 పరీక్షలన్నీ ఎడమ చేతితోనే రాశా. షార్ట్ హ్యాండ్ హయ్యర్ గ్రేడ్ ఎడమ చేతితోనే రాశా. నా ఎడమ చేతి రాతను కళాశాలలోని అధ్యాపకులతో పాటు సహచర విద్యార్థులు అభినందించేవారు.

- బీవీ రమణ, డిప్యూటీ కలెక్టర్, అడ్మినిస్ట్రేటర్, కింగ్ జార్జ్ హాస్పిటల్, వైజాగ్

ఎడమ చేతి రాత కష్టమనిపించ లేదు



చిన్నప్పటి నుంచి అక్షరాలు ఎడమ చేతితోనే రాశా. ఎంఏ, పీహెచ్‌డీ వంటి పరీక్షలన్నీ ఎడమ చేతితోనే రాయడంతో ఎడమ చేతి రాత నాకు కష్టమనిపించ లేదు. ప్రతి తరగతిలోనూ స్ఫూర్తిగా నిలిచి అభినందించేవారు. .

- డాక్టర్ కె.రాధాపుష్పావతి రిటైర్డ్ కళాశాల ప్రిన్సిపాల్, తణుకు

చిన్నప్పటి నుంచి ఎడమ చేతితోనే..



చిన్నప్పట్టి నుంచి ఎడమ చేతితో రాయడం అలవాటు. దీనితో నానమ్మ, తాతయ్య, మా అమ్మ, నాన్నలను కొంచెం హేళనగా మాట్లాడేవారు. అయినా నా రాతలో మాత్రం మార్పు రాలేదు. బీటెక్ పరీక్షలన్నీ ఎడమ చేతితోనే రాశా. ప్రస్తుతం ఎలక్ట్రికల్ ఏఈగా పనిచేస్తున్నా. మా ఇంటిలో నా ఒక్కడికే ఈ అలవాటు వుంది. ఏమాత్రం ఇబ్బందిగా లేదు.

- ఎం.రమేష్ బాబు ఎలక్ట్రికల్ ఏఈ, ఉండ్రాజవరం.

మా ముగ్గురిదీ ఎడమ చేతి అలవాట్లే..



మా ఇంటిలో మా అన్నయ్య, చెల్లెలితో పాటు నాకు మొదటి నుంచి ఎడమ చేతితోనే రాసే అలవాటు ఉంది. పనులు కూడా అలానే చేస్తాం. మా మేనమామకు ఎడమ చేతి వాటమే. ఎడమ చేతితోనే అన్ని పనులు చేయడం అలవాటు అయింది. ఇబ్బం దిగా ఉండదు.. యథావిధిగా పనులు చేస్తుంటాం.

- యార్లగడ్డ సరోజని, ఏఎన్ఎం, ఇరగవరం.

వాలీబాల్ అంటే చాలా ఇష్టం



వాలీబాల్ ఆడడమంటే చాలా ఇష్టం. తన కోచ్ నల్లి పోశియ్య సహకారంతో శిక్షణ తీసుకుంటున్నా.. మా అక్క కూడా వాలీ బాల్ చాలా బాగాఆడేది. నాకు కూడా అదే అలవాటు అయింది. మా నాన్న ఎంతో కష్టపడి మా అక్కను, నన్ను చదివిస్తున్నారు. చదువును నిర్లక్షం చేయకుండానే క్రీడలలో కూడా రాణించాలనేది లక్ష్యం. ఎప్పటికైనా జాతీయస్థాయి వాలీబాల్ జట్టుకు ప్రాతినిధ్యం వహించాలి. స్పోర్ట్స్ కోటాలో మంచి ప్రభుత్వ ఉద్యోగం సంపాదించడమే లక్ష్యం

- లక్ష్మీచాందినిశ్రీ వాలీబాల్ క్రీడాకారిణి

జాతీయ స్థాయి వాలీబాల్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తా..

- లక్ష్మీచాందినిశ్రీ వాలీబాల్ క్రీడాకారిణి

పెంటపాడు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చదువులోనే కాదు క్రీడల్లోనూ రాణిస్తున్నారు. మండల, జిల్లాస్థాయి నుంచి రాష్ట్రస్థాయికి ప్రాతినిధ్యం వహిస్తూ లక్ష్యాలు చేరుకుంటున్నారు. చదివిన పాఠశాలకే కాదు, తల్లిదండ్రులకు, పుట్టిన ఊరుకు కూడా మంచి పేరు తీసుకువస్తున్నారు. ఆ కోవలోకే పెంటపాడు గ్రామానికి చెందిన జీ.లక్ష్మీచాందినిశ్రీ. పెంటపాడు పోస్టు బేసిక్ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతుంది. ఆ క్రీడాకారిణి ఇటీవల తణుకులో జరిగిన అండర్-14 విభాగం రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ క్రీడలకు ఎంపికైంది. లాంగ్ జంప్, బ్యాక్ షార్ట్‌పుట్, రన్నింగ్ క్రీడలలో తన సత్తా చాటుకుని రాష్ట్రస్థాయికి చేరింది. చీరాలలో జరిగిన రాష్ట్రస్థాయిలో కూడా వీరోచితంగా ఆడి ఓటమి పాలైంది. అయినా ఎక్కడా బెదురు లేదు, ఆత్మస్థైర్యాన్ని పోగట్టుకోలేదు. ఎప్పటికైనా వాలీబాల్ పోటీలలో జాతీయ స్థాయి జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తానంటూ చెబుతుంది.

ఆమె తండ్రి గొలుగూరి వెంకటరామరెడ్డి తాడేపల్లిగూడెం మార్కెట్‌లో జట్టు కూలీగా పనిచేస్తారు. తల్లి శారద గృహిణి. వీరికి ఇద్దరు ఆడపిల్లలు. మొదటి అమ్మాయి లక్ష్మీతేజశ్రీ కూడా వాలీ బాల్ పోటీలలో జిల్లా స్థాయి వరకు ప్రతిభ కనబర్చింది. అక్కచెల్లెలు ఇద్దరూ కేవలం చదువులోనే కాదు ఆటలలో కూడా ఉత్తమ ప్రతిభ కనపరుస్తున్నారు.



వాలీబాల్ ప్రాక్టీసు చేస్తున్న లక్ష్మీచాందినిశ్రీ

ప్రతి రోజు ప్రాక్టీస్ చేస్తుంది..



ఒక సంవత్సర కాలం నుంచి మాత్రమే వాలీబాల్ ప్రాక్టీస్ చేస్తుంది. ఒక ఏడాదిలోనే ఎంతగానో ప్రతిభ కనబరుస్తుంది. స్కూల్ సమయం గడిచిన తరువాత రోజు కనీసం రెండు గంటలైన క్రమం తప్పకుండా ప్రాక్టీసు చేస్తుంది. ఎంచుకున్న లక్ష్యాన్ని చేరుకునేందుకు పట్టుదల, కృషి చూస్తుంటే కచ్చితంగా సాధిస్తుంది.

- నల్లి పోశియ్య, వాలీబాల్ కోచ్



పోలీస్ బందోబస్తు మధ్య కూల్చివేత..
కోర్టు ప్రాంగణానికి ఆనుకుని కూల్చిన గోడ

బీవీఆర్ కళా కేంద్రం, ఆఫీసర్స్ క్లబ్ సరిహద్దు గోడ కూల్చివేత

తాడేపల్లిగూడెంలో భారీ బందోబస్తుతో తొలగింపు

తాడేపల్లిగూడెంరూరల్,ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం నడిబొడ్డున ఉన్న కోర్టు ప్రాంగణం సరిహద్దులో ఉన్న బీవీఆర్ కళాకేంద్రం, ఆఫీసర్స్ క్లబ్‌లకు సంబంధించిన సరహద్దు గోడ మంగళవారం ఉదయం పోలీసుల భారీ బందోబస్తుతో కూల్చి వేశారు. ప్రభుత్వ భూమిలో గతంలో నిర్మించిన ఆఫీసర్స్ క్లబ్, బీవీఆర్ కళా కేంద్రం నిర్మాణం చేయగా జిల్లా కోర్టు ప్రాంగణానికి దారికోసం కోర్టు అధికారులు ప్రభుత్వానికి విన్నవించారు. ఆ భవనాలు తొలగిస్తే కోర్టు ప్రాంగణానికి దారి లభిస్తుందని ఆ భవనాలు ఖాళీ చేయాలని సంబంధిత నిర్వాహకులకు నోటీసులు జారీ చేశారు. బీవీఆర్ కళాకేంద్ర నిర్వాహకులు, కళాకారులు.. భవనాలు కూల్చొద్దని ప్రతిఘటించారు. దీనిలో భాగంగా మునిసిపల్ కమిషనర్ కలెక్టర్ ఆదేశాల మేరకు కమిషనర్ ఏసుబాబు, తహసీల్దార్ ఎం.సునీల్‌కుమార్ పర్యవేక్షణలో గోడ కూల్చివేశారు. దారికి అడ్డుగా ఉన్న చెట్టు, ఆఫీసర్స్ క్లబ్ కొంతభాగాన్ని ఎక్స్‌కవేటర్ల సాయంతో తొలగించారు. ఇరుకు సందులా ఉన్నకోర్టు ప్రాంగణానికి వెడల్పయిన మార్గం ఏర్పాటు చేయనున్నారు. మరోవైపు దశాబ్దాలుగా కళలకు వేదిక అయిన బీవీఆర్ కళాకేంద్రం మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందా ? అని కళాకారులు, కళా ప్రేమికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉదయం ఆరు నుంచి పది గంటల వరకు మునిసిపల్, రెవెన్యూ అధికారుల పర్యవేక్షణలో ఈ కూల్చివేత కొనసాగింది. ఆ సమయంలో తాడేపల్లిగూడెం, తణుకు సర్కిల్ నుంచి భారీగా పోలీసులు మొహరించారు. వాహనాల రాకపోకలు లేకుండా దారి మళ్లించారు. సీఐలు ఆదిప్రసాద్, రవికుమార్, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

వన్ డిస్ట్రిక్ట్.. వన్ ప్రాడక్ట్‌కు కేంద్రం ప్రోత్సాహం

ఎంపీ మహేశ్ ప్రశ్నకు మంత్రి జితిన్ సమాధానం

ఏలూరు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): వన్ డిస్ట్రిక్ట్.. వన్ ప్రాడక్ట్(ఓడీవోపీ) ఉత్పత్తులను ప్రోత్సహించేందుకు కేంద్ర పరిశ్రములు, అంతర్గత వాణిజ్య ప్రోత్సాహక విభాగం (డీపీఐఐటీ) ప్రత్యేక కార్యక్రమం చేపట్టిందని కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి జితిన్‌ప్రసాద్ తెలిపారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల సందర్భంగా ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్‌యాదవ్ అడిగిన ప్రశ్నకు ఆయన ఈమేరకు సమాధానం ఇచ్చారు. ఓడీవోపీ ఉత్పత్తులను ప్రోత్సహించేందుకు గిఫ్ట్ క్యాటలాగ్ ప్రవే శపెట్టామని దీనిలో వెయ్యికిపైగా ఉత్పత్తులు లభిస్తాయని, వాటిలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన 'ఏటికొప్పాక బొమ్మలు, ధర్మవరం చీరలు' వంటివి ఉన్నాయన్నారు. ఈ ఉత్పత్తులను ప్రోత్సహించేందుకు పీఎం ఏక్తా మాల్స్ పేరుతో నిర్మాణాలు చేపట్టామని, దీనిలో భాగంగా విశాఖపట్నంలో ఐదు ఎకరాల్లో మాల్ నిర్మాణం చేపట్టామన్నారు.



పరస్పర ఒప్పందాలతో ఉపకులపతి డాక్టర్ గోపాల్, సంస్థల ప్రతినిధులు

'పరస్పర అవగాహనతో సాంకేతిక అభివృద్ధి'

తాడేపల్లిగూడెం రూరల్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): విద్యా సంస్థలు, ఇతర కంపెనీలతో ఉద్యాన వర్సిటీ పరస్పర ఒప్పందంతో సాంతికేతిక అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లవచ్చని ఉపకులపతి డాక్టర్ బి.గోపాల్ పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం మండలం వెంకట్రామన్నగూడెంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయ ఆవరణలో పలు సంస్థలతో మంగళవారం పరస్పర ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ ఒప్పందాలను హైదరాబాద్ బయోఫ్యాక్టర్, పులివెందులకు చెందిన జినోమిక్స్, మదనపల్లికి చెందిన మదనపల్లి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజితో, సిస్ ఇన్నోవా సంస్థలతో ఈ ఒప్పందాలు కుదుర్చుకున్నారు. కార్యక్రమంలో ఆ సంస్థల ప్రతినిధులతో ఉద్యాన వన సాగు, మొక్కల ఆరోగ్యం, పంటకోత తర్వాత సాంకేతికత డ్రోన్‌లు తదితర అంశాలపై సాంకేతిక పరస్పర ఒప్పందం సాగింది. కార్యక్రమంలో డైరెక్టర్ ఆఫ్ ఇండస్ట్రియల్ కె.ధనుంజయ్‌రావు, డీన్‌ఆఫ్ హార్టికల్చర్ ఎం.మాధవి, రిజిస్ట్రార్ బి.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

రేపు అండర్-15 వాలీబాల్ జట్ల ఎంపిక పోటీలు

ఏలూరు అర్బన్,ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా అండర్-15 వాలీబాల్ (బాలురు, బాలికలు) జట్ల ఎంపిక పోటీలు ఈనెల 14న ఉదయం ఏలూరు అల్లూరి సీతారామరాజు స్టేడియంలో నిర్వహిస్తామని స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల ఆర్గనైజింగ్ కార్యదర్శులు కె.అలువేలుమంగ, మల్లేశ్వరరావు తెలిపారు. చైనాలో ఈ ఏడాది డిసెంబరు 4నుంచి 13వ తేదీ వరకు జరుగనున్న ప్రపంచ పాఠశాలల వాలీబాల్ చాంపియన్‌షిప్‌లో భారతదేశం నుంచి పాల్గొనే జాతీయ జట్ల ఎంపికలో భాగంగా రాష్ట్ర, జిల్లాస్థాయి జట్లకు వేర్వేరుగా ఎనిమిది మంది బాలురు, బాలికలను ఎంపికచేస్తారని వివరించారు. జాతీయ స్థాయిలో పుణెలోని బలేవాడిలో జరిగే పోటీల్లో రాష్ట్ర జట్లు పాల్గొంటాయని తెలిపారు. ఈ ఎంపికకు పాస్‌పోర్టు కలిగి, 2010 నుంచి 2013 లోపు సంవత్సరాల్లో పుట్టినవారు మాత్రమే ఈ సెలక్షన్లకు అర్హులని తెలిపారు. రాష్ట్ర జట్ల ఎంపికను విజయవాడలోని కేబీసీ జడ్పీ బాలుర హైస్కూలులో ఈనెల 18న నిర్వహిస్తారని వివరించారు.

నిలకడగా గోదావరి నీటిమట్టం

పోలవరం నుంచి 1,45,797 క్యూసెక్కుల విడుదల



పోలవరంలో ఏపీ టూరిజం పాయింట్ వద్ద గోదావరి ఉధృతి

పోలవరం, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): పోలవరంలో గోదావరి నీటిమట్టం మంగళవారానికి నిలకడగా మారింది. నాలుగు రోజులుగా ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరిలో నీటిమట్టం స్వల్పంగా తగ్గుతూ పెరుగుతూ ప్రస్తుతం నిలకడగా ఉంది. ప్రాజెక్టులోకి వస్తున్న 1,45,797 క్యూసెక్కుల జలాలను దిగువకు విడుదల చేసినట్టు జలవనరుల శాఖ అధికారులు తెలిపారు. స్పిల్వే ఎగువన 27.550 మీటర్లు, స్పిల్వే దిగువన 17.700 మీటర్లు నీటిమట్టం నమోదైంది.

- గత వారం నరసాపురం మండలం నవరసపురంలో పేకాడుతున్నట్టు పోలీసులకు సమాచారం అందింది. వెంటనే దాడులు నిర్వహించి ఏడుగురిని అరెస్టు చేసి రూ. 19 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు.
- అదే వారం లక్ష్మణేశ్వరంలో పేకాడుతున్నట్టు సమాచారం రాగా దాడులు జరిపి ఐదుగుర్ని అరెస్టు చేసి రూ. 3500 నగదు స్వాధీనం చేసుకున్నారు.
- మూడు రోజుల క్రితం వైఎస్ పాలెంలో దాడిచేసి ఐదుగురిని అరెస్టు చేసి రూ.4 వేలు స్వాధీనం చేసుకున్నారు.
- ఆదివారం సరిపల్లి గ్రామ శివారున ఓ ఇంటిపై పోలీసులు దాడి చేసి పేకాడుతున్న ఆరుగురిని అరెస్టు చేసి రూ.9 వేలు నగదు స్వాధీనం చేసుకున్నారు.
- వీరవాసరం మండలం మత్స్యపురిలో పేకాట శిబిరంపై దాడి చేసి తొమ్మిది మందిని అరెస్టు చేశారు.
- మొగల్తూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో హైవేపై ఉన్న ఓ హోటల్‌పై పోలీసులు దాడి చేసి పేకాడుతున్న ఐదుగురిని అరెస్టు చేసి రూ. 16 వేలు నగదు స్వాధీనం చేసుకున్నారు.

ఇలా చెప్పుకుంటూ పోతే జిల్లాలోని పలుచోట్ల పోలీసులు నిర్వహిస్తున్న వరుస దాడుల్లో అనేక చోట్ల పేకాట శిబిరాలు వెలుగు చూస్తున్నాయి.



జోరుగా.. ముక్కాట

గ్రామాల్లో జోరుగా పేకాట ▸ పోలీసుల వరుస దాడులు
అయినా వెలుగుచూస్తున్న పేకాట శిబిరాలు
చోటా నాయకుల అండదండలతోనే జూదం ?

నరసాపురం, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ఇళ్లు, లాడ్జిలు, పొలాలు, తోటల్లో ఎవరికీ అనుమానం రాకుండా గుట్టుచప్పుడు కాకుండా పేకాడేస్తున్నారు. ఇటు మొగల్తూరు మండలంలో గత కొంతకాలంగా విచ్చలవిడిగా పేకాట జరుగుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. పేరుపాలెం సమీపంలోని తోటల్లో, ముత్యాలపల్లి, వారతిప్ప, కాళీపట్నం తదితర గ్రామాల్లో చోటా నాయకుల అండదండలతో గుట్టుచప్పుడు కాకుండా పేకాట జరుగుతున్నట్టు గుసగుసలు వినిపిస్తున్నాయి. సరిహద్దునున్న కృష్ణా జిల్లా నుంచి కొందరు జూదగాళ్లు ఈ శిబిరాలకు వచ్చి పేకాడుతున్నట్లు చర్చ జోరుగా సాగుతోంది. శని, ఆదివారాల్లోనే ఎక్కువగా శిబిరాలు నిర్వహిస్తున్నట్టు సమాచారం. గతంలో నరసాపురం మండలం సీతారంపురం గ్రామంలో యూత్ క్లబ్ ముసుగులో పేకాట సాగించారు. దీనిపై పోలీసులు రెండు సార్లు దాడులు చేసి జూదం ఆడుతున్న పలువుర్ని అరెస్టు చేశారు. దీంతో క్లబ్ మూతపడింది. ఇక క్లబ్‌లు లేవని అంతా భావించారు. అయితే పోలీసుల దాడుల్లో వరుసగా పేకాట శిబిరాలు వెలుగు చూస్తుండటం ఉలికిపాటుకు గురి చేసింది. గతంలో సంక్రాంతి సమయంలోనే పేకాట, ముక్కాట, కోడిపందాలు వంటి జూదం జరిగేవి. ఆ తరువాత అడపా దడపా పోలీసుల దాడుల్లో పేకాట రాయుళ్లు పట్టుబడిన సంఘటనలు తప్ప ఇంత విచ్చలవిడిగా జూదం జరిగిన దాఖలాలు లేవు. అయితే వెలుగుచూసిన శిబిరాలు కొన్నేనని, ఇంకా చాల చోట్ల జూదం జరుగుతోందన్న వాదనలు తీరంలో జోరుగా వినిపిస్తున్నాయి. గ్రామ శివారుల్లో ఉండే అక్వా చెరువుల గట్లుపై ఉండే అతిథి గృహాలు పేకాట రాయుళ్లకు అడ్డాగా మారాయన్న వాదనలు వినిపిస్తున్నాయి.



ఏపీ నిట్‌లో మాట్లాడుతున్న ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీలత

మత్తుకు దూరంగా ఉండాలి

తాడేపల్లిగూడెం అర్బన్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మత్తు పదార్థాలు, ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్(ఏలూరు) బోయపాటి శ్రీలత అన్నారు. అంతర్జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏపీ నిట్‌లో మంగళవారం యాంటీ ర్యాగింగ్‌డే, నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీలత మాట్లాడుతూ విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అసిస్టెంట్ కమిషనర్ కేవీఎన్ ప్రభుకుమార్ మాట్లాడుతూ డ్రగ్స్ రహిత సమాజ స్థాపనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్‌శంకర్‌రెడ్డి మాట్లాడుతూ సీనియర్ విద్యార్థులు జూనియర్లతో స్నేహంగా మెలగాలన్నారు. మత్తుకు అలవాటు పడితే వాటి నుంచి బయటపడడం కష్టమవుతుందన్నారు. గూడెం రూరల్ సీఐ రవికుమార్ ర్యాగింగ్‌కు పాల్పడితే విధించే శిక్షలను వివరించారు. కార్యక్రమానికి కో ఆర్డినేటర్‌గా అసోసియేట్ డీన్ డాక్టర్ రాజేశ్వరరెడ్డి వ్యవహరించారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ స్వరాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేడు భీమవరానికి మాజీ సీఎం జగన్

భీమవరం టౌన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం వైఎస్ జగన్ బుధవారం భీమవరం రానున్నారు. ఉంగుటూరు మాజీ ఎమ్మెల్యే పుప్పాల శ్రీనివారావు కుమార్తె వివాహ వేడుకకు హాజరయ్యేందుకు మధ్యాహ్నం 3-15 గంటలకు తాడేపల్లిలోని ఇంటి నుంచి హెలీప్యాడ్‌కు చేరుకుంటారు. 3-30కు హెలికాప్టర్‌లో భీమవరం బయలుదేరతారు. 4-15కు భీమవరంలో ఏర్పాటుచేసిన హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. 4-25 నిమిషాలకు భీమవరంలోని వీవీఎస్ గార్డెన్స్‌కు చేరుకుని శ్రీనివాసరావు కుమార్తె వివాహ వేడుకల్లో పాల్గొంటారు. 4-50 వరకు అక్కడే ఉంటారు. తరువాత హెలీప్యాడ్‌కు బయలుదేరుతారు. 5 గంటలకు భీమవరం నుంచి తాడేపల్లి బయలుదేరుతారు. 5-55 తాడేపల్లి చేరకుంటారు.

గంబూసియాతో దోమలకు చెక్



గంబూసియా చేపల విడుదలను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

ఏలూరు అర్బన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): దోమలవ్యాప్తిని అరికట్టేందుకు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని అన్ని పురపాలక సంఘాల పరిధిల్లో నివాసిత ప్రాంతాల మధ్య మురుగునీరు, మంచినీటి చెరువుల్లో లార్వాలను తినివేసే గంబూసియా చేపలను, ఆయిల్ బాల్స్‌ను వదిలే కార్యక్రమాలను మంగళవారం నిర్వహించినట్టు డీఎంహెచ్‌వో డాక్టర్ పీజే అమృతం వెల్లడించారు. ఏలూరులోని పలు కాలనీల్లో నీటి నిల్వలున్నచోట గంబూసియా చేపలను వదిలే కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. దోమల లార్వాలే గంబూసియా చేపలకు ఆహారమని, లార్వా ధ్వంసం చేయడానికి హానికర రసాయనాలు, పురుగుమందులతో పని లేకుండా గంబూసియా చేపల ను వదలడం ద్వారా సహజ సిద్ధంగానే దోమల వ్యాప్తిని అరికట్టవచ్చునని డీఎంహెచ్‌వో పేర్కొన్నారు. ఏటా వర్షాలు పడుతున్న రోజుల్లోనే ఈ కార్యక్రమాన్ని ఏకకాలంలో నిర్వహిస్తుంటారని వివరించారు. ప్రస్తుత సీజన్‌లో జ్వరం వస్తే అశ్రద్ధ చేయ వద్దన్నారు. నగర పాలక సంస్థ అడిషనల్ కమిషనర్ శివారెడ్డి, అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్ గోవిందరావు, ఏలూరు కార్పొరేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న రత్న ప్రసాద్

చట్టాలే రక్షణ కవచం

ఏలూరు క్రైం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీలు దాడులను ఎదుర్కోవడానికి అట్రాసిటీ చట్టాలు ఉపయోగించుకుని రక్షణ పొందవచ్చునని ఉమ్మడి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె. రత్నప్రసాద్ అన్నారు. మంగళవారం సంస్థ భవనంలో చట్టాలపైన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ పోలీస్ స్టేషన్లలో బాధితుల ఫిర్యాదును నమోదు చేయకపోతే వాటిని కోర్టులలో దాఖలు చేయవచ్చునని తెలిపారు. అలాగే ఈ చట్ట ప్రకారం ప్రతి జిల్లాలో కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రతి మూడు నెలలకు ఒక పర్యాయం విజిలెన్స్ మోనిటరింగ్ కమిటీ ఏర్పాటు చేసి, షెడ్యూల్డు కులాలు, తెగల కేసుల పురోగతిపైన సమీక్షించాల్సి ఉందని తెలిపారు. సాక్షుల రక్షణ బాధ్యతను కూడా ప్రభుత్వాలు తీసుకోవాలని, బాధితులకు పరిహారాన్ని చెల్లిస్తారని తెలిపారు. పరిహారాన్ని పొందడంతో ఏవైనా సమస్యలు ఎదురైతే జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్ర దిం చాలని సూచించారు. ఏలూరు డీఎస్పీ డి శ్రావణ్‌కుమార్, న్యాయవాది పి రత్నరాజు, సోషల్ వర్కర్ మేతర అజయ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో విద్యార్థి సంఘాల నాయకుల సంఘీభావం

విద్యార్థి సంఘాల ప్రవేశ నిషేధం తగదు

ఏలూరు అర్బన్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి):ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల ప్రాంగణాల్లోకి విద్యార్థి సంఘాలు, అనధికార వ్యక్తులు, సంస్థల ప్రవేశంపై నిషేధాన్ని విధిస్తూ జారీ చేసిన ఉత్తర్వులను రద్దు చేయాలని మంగళవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో జరిగిన విద్యార్థి సంఘాల జేఏసీ రౌండ్ టేబుల్ సమావేశం డిమాండ్ చేసింది. సమావేశం వివరాలను ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి లెనిన్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు నాని స్థానిక మీడియాకు తెలియజేశారు. రాజకీయ పార్టీలను, విద్యార్థి సంఘాలను ఒకేగాటన కట్టడం సరి కాదన్నారు. విద్యార్థి సంఘాల గొంతును నులిమేయడం ప్రభుత్వాలకు పరిపాటిగా తయారైందన్నారు. జీవోలను వెనక్కు తీసుకుని అన్ని విద్యాసంస్థల్లో విద్యార్థి సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. జీవోల ఉపసంహరణకు, విద్యార్థి సంఘాలకు ఎన్నికల నిర్వహణకు డిమాండ్ చేస్తూ బుధ, గురువారాల్లో విద్యార్థి సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం కార్యక్రమాలను నిర్వహించాలని రౌండ్‌టేబుల్ సమావేశంలో తీర్మానించినట్టు వెల్లడించారు.

అడిగిన కూలీ ఇవ్వలేదని మహిళ ఆత్మహత్య

కొయ్యలగూడెం, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): భర్త కోపగించుకున్నాడనే మనస్థాపంతో వివాహిత ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన బయ్యన్నగూడెం గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. నంగన పరిమళ(23) ఉరి వేసుకుంది. పరిమళ ఓ రైతు పొలంలో కూరగాయాలు కొయ్యడానికి కూలి పనికి వెళ్తోంది. కూలీ రూ.200 కాదని, రూ.300 ఇవ్వాలని మేస్త్రిని అడగడంతో ఆమె నిరాకరించింది. ఇదే విషయమై రైతు కూడా మాట్లాడుతూ రూ.200 ఇస్తామని నచ్చకపోతే మానేయమని చెప్పాడు. ఈ విషయం పరిమళ భర్త శ్రీరాములికి చెప్పింది. భర్త కూడా నీకు ఇష్టమైతే వెళ్లు లేకపోతే మానేయమనడంతో మనస్థాపానికి గురై ఇంట్లో చీరకు ఉరివేసుకుంది. కుటుంబ సభ్యులు గుర్తించి జంగారెడ్డిగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్.ఐ. చంద్రశేఖర్ తెలిపారు.

ఒక్కొక్కరికి రూ.10 వేలు జరిమానా

ఆకివీడు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): వారం రోజులుగా నిర్వహిస్తున్న డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వారికి జడ్జి భారీ జరిమానా విధించారు. సీఐ వి.జగదీశ్వరరావు, ఎస్ఐ హనుమంతు నాగరాజులు ఈ డ్రైవ్ చేపట్టి పలువురిని గుర్తించి కేసులు నమోదు చేశారు. వారిలో మంగళవారం ఐదుగురు భీమవరం కోర్టుకు వెళ్లగా జడ్జి ఎంవీఎస్ రాజారావు ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున జరిమానా విధించినట్టు పోలీసులు తెలిపారు.

మద్యం తాగొద్దన్నందుకు ఆత్మహత్యాయత్నం

పోలవరం, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి):మద్యం తాగొద్దన్నందుకు విషం తాగి ఒక యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన పోలవరం మండలం ప్రగడపల్లిలో జరిగింది. తూర్పు గోదావరి జిల్లా దేవరపల్లి మండలం బందపురం గ్రామానికి చెందిన దమ్మిశెల్లి నాగేంద్ర అనే యువకుడు అతని భార్యతో కలిసి పోలవరం మండలం ప్రగడపల్లిలో కాపురం ఉంటున్నారు. నాగేంద్ర లారీ డ్రైవరుగా పని చేస్తున్నాడు. భార్య దొండపూడిలో లారీ కాటాలో పని చేస్తోంది. నిత్యం మద్యం తాగుతూ బాధ్యత లేకుండా ప్రవర్తిస్తున్నాడని ఇంట్లో నుంచి పొమ్మని భార్య మందలించడంతో మనస్థాపం చెంది కలుపుమందు తాగాడు. గమనించిన భార్య పోలవరం ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించగా మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరం సిఫార్సు చేశారు.

పాముకాటుతో ఇద్దరు మహిళలకు అస్వస్థత

పోలవరం, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి):పాముకాటుతో వేర్వేరు ప్రాంతాలకు చెందిన ఇద్దరు మహిళలు ఆస్పత్రిపాలయ్యారు. పోలవరం ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ రాంబాబు తెలిపిన వివరాల ప్రకారం.. పోలవరం మండలం జిల్లెళ్లగూడెం పంచాయతీ రెడ్డి కుంకాల గ్రామానికి చెందిన వ్యవసాయ కూలి వాయిల పద్మ, పోలవరం పంచాయతీ ఏనుగులవారి వీధికి చెందిన వ్యవసాయ కూలి నగేరు లక్ష్మి పొలంలో పని చేస్తుండగా పాముకాట్లకు గురయ్యారు. అస్వస్థతకు గురైన వారిని పోలవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వైద్యాధికారి టి.కృష్ణంరాజు వైద్య సేవలందించారు. ప్రస్తుతం వారి పరిస్థితి నిలకడగానే ఉందని అబ్జర్వేషన్‌లో ఉంచామన్నారు. గడిచిన రెండు నెలల్లో సుమారు 20కి పైగా పాము కాటు కేసులు నమోదయ్యాయని వారికి చికిత్స అందించినట్టు తెలిపారు. వ్యవసాయ కూలీలు, రైతులు పాములు, విష కీటకాల పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్యులు హెచ్చరించారు. అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో పాముకాటు విరుగుడు మందులు అందుబాటులో ఉన్నాయని అత్యవసర పరిస్థితుల్లో సమీపంలో ప్రభుత్వ వైద్య శాలకు పాముకాటు బాధితులను తరలించి వైద్య సేవలందించాలని వైద్యుడు కృష్ణంరాజు సూచించారు.

భర్త కనిపించడం లేదంటూ భార్య ఫిర్యాదు

ఏలూరు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): భర్త కనిపించడం లేదంటూ భార్య పోలీసులకు ఫిర్యాదు చేసిన ఘటన లింగ పాలెం మండలంలో జరిగింది. లింగపాలెం మండలం పుప్పాల వారిగూడెం గ్రామానికి చెందిన దాసరి రాంబాబు(48)అనే వ్యక్తి సోమవారం ఉదయం ఇంటిలో గొడవపడి బయటకు వెళ్లిపోయాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో భార్య పోలీసు లకు ఫిర్యాదు చేసినట్టు ధర్మాజీగూడెం ఎస్ఐ కె.వెంకన్న తెలిపారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ కె.వెంకన్న తెలిపారు.

ఎన్నాళ్లో వేచిన ఉదయం

ఆరేళ్ల తరువాత దొరికిన భార్య, ఇద్దరు పిల్లలు
కుటుంబానికి అప్పగించిన పోలీసులు
మిస్సింగ్ కేసును ఛేదించిన పోలీసులు



కుటుంబానికి అప్పగిస్తున్న పోలీసులు

ఏలూరు క్రైం, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ఆరేళ్ల క్రితం అదృశ్యమైన తల్లి, ఇద్దరు పిల్లలను పోలీసులు గుర్తించి తీసుకొచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు.రాష్ట్ర డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా ఉత్తర్వులతో జిల్లా ఎస్పీ కెప్రతాప్ శివ కిషోర్ ఆదేశాలపై ఆపరేషన్ ట్రేస్ కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా ఈ నెల 1 నుంచి చేపట్టారు. దీనిలో భాగంగా ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం ఈ మిస్సింగ్ కేసులపై దృష్టిసారించింది. ఏలూరు రూరల్ పోలీస్ స్టేషన్‌లో 2019లో నమోదైన కేసును పరిశీలించారు. ఒక మహిళ ఆమె మూడేళ్ల కుమారుడు, రెండేళ్ల కుమార్తెను తీసుకుని వెళ్లిపోయింది. బంధువుల ఫిర్యాదుతో అప్పట్లో పోలీసులు ఆమె కోసం వెతికినా ఆచూకీ కానరాలేదు. ప్రస్తుతం ఆపరేషన్ ట్రేస్ నిర్వహిస్తున్న నేపథ్యంలో ఈ కేసుపై పోలీసులు దృష్టిసారించారు. ఆ కేసు పూర్వాపరాలను పరిశీలించారు. ఏలూరుకు చెందిన దుర్గాప్రసాద్ గతంలో హైదరాబాద్‌లో పనిచేయడానికి వెళ్లాడు.అదే సమయంలో వరంగల్‌లోని నాగారానికి చెందిన వంటి సౌజన్య పనుల కోసం హైదరాబాద్ రాగా వారిద్దరూ ఒకే పనిలో ఉండడంతో ప్రేమించుకున్నారు.ఆ తరువాత ఇద్దరూ ఏలూరు వచ్చి ఇక్కడ జీవిస్తుండగా కుమారెడు, కుమార్తె జన్మించారు.భర్త దుర్గా ప్రసాద్ మద్యం తాగుతూ బాధ్యతారాహిత్యంగా మారడంతో ఆమె విసుగు చెంది తన ఇద్దరి పిల్లలను తీసుకెళ్లిపోయింది. అప్పటి నుంచి పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి ఆ మహిళ ఆచూకీని పోలీసులు కనుగొన్నారు.వరంగల్‌లో జీవిస్తూ ఒక షాపులో పని చేస్తోందని గుర్తించారు. ఏలూరు రూరల్ ఎస్ఐ కె.నాగబాబు, కైకలూరు టౌన్ ఎస్ఐ వెంకట కుమార్, హెడ్ కానిస్టేబుల్ కనకాంబరం, హెడ్ కానిస్టేబుల్ పాండురంగారావు, కానిస్టేబుల్ విజయ్ కుమార్,మహిళా కానిస్టేబుల్ చైతన్యలు మొత్తం మీద ఆ తల్లి పిల్లలను గుర్తించారు. వారిని ఏలూరు తీసుకొచ్చి మంగళవారం మధ్యాహ్నం ఏలూరు డీఎస్పీ కార్యాలయంలో భర్త దుర్గా ప్రసాద్‌కు ఆమె బంధువులకు అప్పగించారు. కుమారుడు 4వ తరగతి, కుమార్తె 3వ తరగతి చదువుతోందని తల్లి సౌజన్య చెప్పడంతో ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్ కుమార్ స్పందించి పుస్తకాలు, స్కూల్ బ్యాగ్‌ను అందజేసి బాగా చదువుకోవాలని ఆ పిల్లలను దీవించారు.ఏదైనా సహాయం కావాల్సి వస్తే తాను తన సిబ్బంది, అధికారులు అన్ని వేళలా అందుబాటులో ఉంటామని, అధైర్య పడొద్దని డీఎస్పీ హామీ ఇచ్చారు. భర్త ఇకపై బాధ్యతగా మెలగాలని హెచ్చరించారు.

భార్య ఆత్మహత్య కేసులో భర్తకు ఏడేళ్ల జైలు

ఏలూరు క్రైం, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): వివాహ సమయంలో ఇచ్చిన కట్నం లేదంటూ అదనపు కట్నం తీసుకురావాలని వేధించడంతో ఆ వేధింపులు భరించలేక భార్య ఆత్మహత్య చేసుకున్నట్టు భర్తపై నేరం రుజువు కావడంతో ఏడేళ్ల జైలు, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ ఏలూరులోని 5వ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి ఆర్‌వీవీఎస్ మురళీకృష్ణ మంగళవారం తీర్పు చెప్పారు. లింగపాలెం మండల కలరాయన్నగూడేనికి చెందిన చల్లగొళ్ల రాంబాబు(46)కు 2004లో దెందులూరు మండలం చల్లచింతలపూడి గ్రామానికి చెందిన ఒక యువతితో వివాహమైంది. వివాహ సమయంలో కట్న కానుకలు, బంగారం, సారె సామగ్రి పెట్టి కాపురానికి పంపించారు. వారికి ఒక కుమార్తె కూడా జన్మించింది. అప్పటి నుంచి అదనపు కట్నం తీసుకురావాలని ఆ యువతిని రాంబాబు వేధించాడు. 2007 జులై 9న ఆమె పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. దీంతో అప్పటి ధర్మాజీగూడెం ఎస్ఐ మాణిక్యాలరావు కేసు నమోదు చేయగా అప్పటి జంగారెడ్డిగూడెం డీఎస్పీ బసవ పున్నయ్య కేసు దర్యాప్తు చేసి ముద్దాయిని అరెస్టు చేసి కోర్టులో ఛార్జిషీటు దాఖలు చేశారు. ఈకేసు ఏలూరులోని ఐదవ అదనపు జిల్లా సెషన్స్ కోర్టులో విచారణ సాగింది. నిందితుడైన రాంబాబుపై నేరం రుజువు కావడంతో శిక్ష విధించారు. నిందితుడికి శిక్షపడేలా సకాలంలో సాక్షులను కోర్టుకు హాజరుపర్చడంలో కేసు దర్యాప్తు, విచారణలోను అత్యంత ప్రతిభ కనబర్చిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ కేపీఎస్ కిశోర్ అభినందించారు.

వేర్వేరు చోట్ల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

ద్వారకాతిరుమల, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రహదారిపై మండలంలోని రెండు వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందారు. లక్ష్మీనగర్ రహదారిపై ఓ వ్యక్తి వాటర్ బాటిల్ కొనుగోలు చేసి రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని లారీ ఢీకొని తీవ్రగాయాలైన అతడిని ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. కామవరపుకోట మండలం నారాయణపురానికి చెందిన పలగాని శ్రీరామ్మూర్తి(36) తన స్నేహితుడితో కలిసి మొక్కజొన్న విత్తనాల కొనుగోలుకు సోమవారం రాత్రి దూబచర్లకు వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో ఘటనాస్థలం వద్దకు వచ్చేసరికే కారుఆపి మంచి నీటి బాటిల్ కొనుగోలుకు దిగి వెళ్తుండగా రాంగ్ రూట్‌లో కప్పలకుంట నుంచి వస్తున్న లారీ వేగంగా వచ్చి ఢీకొట్టి వెళ్లిపోయింది. స్నేహితుడు హుటాహుటిన ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. ద్వారకాతిరుమల ఎస్ఐ అమీర్ ఘటనాస్థలానికి వెళ్లి మృతుని భార్య శ్రావణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

లైన్ గోపాలపురంలో వృద్ధుడు

మండలంలోని లైన్ గోపాలపురం వద్ద రహదారిపై రోడ్డు దాటుతున్న గుర్తుతెలియని వృద్ధుడిని(70) మంగళవారం తెల్లవారు జామున గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వృద్ధుడు అక్కడికక్కడే మృతి చెందాడు. హైవే సిబ్బంది మృత దేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం ఏలూరుకు తరలించారు.

పిచ్చి కుక్క స్వైరవిహారం

పాలకొల్లు రూరల్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): పాలకొల్లు మండలం లంకలకోడేరులోని కాజీవ్ కాలనీ, కోడిదుంప ఏరియాల్లో మంగళవారం ఒక పిచ్చి కుక్క స్వైర విహారం చేసి ఆరుగురిని తీవ్రంగా గాయపరిచింది. వీరిలో పల్లి వెంకటలక్ష్మి, తోటే ఆదాము, ననేటి విజయలక్ష్మిలు తీవ్రంగా గాయాపడగా సన్నిది విఘ్నేష్, మేడిపల్లి రాజేష్, పిల్లి రాజబాబు స్వల్పంగా గాయపడ్డారు. లంకలకోడేరు పీహెచ్‌సీలో వీరికి డాక్టర్ నవ్యజీవన్, వైద్య సిబ్బంది వ్యాక్సిన్‌లు వేసి వైద్య సేవలందించారు. మెరుగైన చికిత్స కోసం పాలకొల్లు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పెదపాడు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): విజయవాడ నుంచి ఏలూరుకు ఈ నెల 8న ట్రక్కు ఆటోలో యాసిడ్ తీసుకొస్తుండగా, ప్రమాదవశాత్తు ఆటో తిరగబడిన ఘటనలో గుంటూరుకు చెందిన షేక్ సంషేర్ అక్కడికక్కడే మృతి చెందగా భర్త ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన భర్త షేక్ అల్లాబక్ష్(55) ఏలూరు ప్రభుత్వాసుపత్రి నుంచి మెరుగైన వైద్యం కోసం గుంటూరు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందినట్లుగా ఎస్.ఐ. కట్టా శారదా సతీశ్ తెలిపారు. పెదపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆటోలో వదిలేసిన సెల్‌ఫోన్ అందజేత



ఏలూరు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ఏలూరు కొత్తబస్టాండ్ సమీపంలో బుధవారం తెల్లవారు జామున ఒక మహిళ పవర్ పేటకు చెందిన చలమాల నాగు అనే వ్యక్తి ఆటో ఎక్కింది. ఆమె సత్రంపాడు విద్యావికాస్ వద్ద హడావుడిలో దిగి వెళ్లిపోయింది. ఆటో సీటులో కూర్చొన్నచోటే ఆండ్రాయిడ్ ఫోన్ మరచిపోయి వదిలేసి దిగిపోయింది. అనంతరం ఆ ఫోన్ గమనించిన ఆటోవాలా నాగు ఆమె పనిచేసి చోటకు వెళ్లి ఫోన్ అందజేశాడు. దీంతో ఆ మహిళ ఎంతో సంతోషిస్తూ ఆటోవాలాకు కృతజ్ఞతలు తెలిపింది.

అభయాంజనేయ స్వామి ఆలయం వద్ద అన్నదానం

పెదపాడు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): అప్పనవీడులో ప్రసిద్ధి చెందిన అభయాంజనేయ స్వామి ఆలయం వద్ద దాతలు చిన్నుపాటి వినోద్‌కుమార్, శ్వేతా దంపతుల ఆర్థికసహకారంతో అన్నదానం నిర్వహించినట్టు ఆలయ ఈవో పి.తారకేశ్వరరావు తెలిపారు. అన్నదానంలో సుమారు 200 మంది భక్తులు అన్న ప్రసాదాలను స్వీకరించారు. మంగళవారం కావడంతో పెద్దసంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకుని పూజా కార్యక్రమాలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

జేపీ యూత్ ఆధ్వర్యంలో చదరంగం, పాటల పోటీలు

జంగారెడ్డిగూడెం, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి):స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జేపీ యూత్ ఆధ్వర్యంలో ఈ నెల 14వ తేదీ ఉదయం తొమ్మిది గంటలకు జేపీ సెంటర్‌లో చదరంగం పోటీలు, 15వ తేదీ సాయంత్రం నాలుగు గంటలకు పాటల పోటీలు నిర్వహించనున్నట్టు జేపీ యూత్ అసోసియేషన్ సభ్యులు మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన వారు ఆయా పోటీలకు గంట ముందు తమ పేర్లను నమోదు చేయించుకోవాలని కోరారు. చదరంగం, పాటల పోటీలు సీనియర్, జూనియర్ విభాగాల్లో జరుగుతాయని తెలిపారు.

ఎమ్మెల్యే చింతమనేనికి త్రిసభ్య కమిటీల కృతజ్ఞతలు

దెందులూరు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ఇప్పటి వరకు గ్రామాల్లో అట్టడుగున ఉన్న సహకార సంఘాలను బలోపేతం చేసే దిశగా త్రిసభ్య కమిటీ చైర్మన్, సభ్యులు మెలగాలని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ సూచించారు. జోగన్నపాలెం, గాలాయగూడెం, మొండూరు, పెదపాడుల గ్రామాలకు చెందిన త్రిసభ్య కమిటీ చైర్మన్లు డాక్టర్ పసుమర్తి మధు, పూజారి వెంకటరత్నం నాయుడు, కొనకళ్ల శివమణి గౌడ్, గారపాటి స్టాలిన్‌లను చింతమనేని దుగ్గిరాల క్యాంపు కార్యాలయంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి బొకేలు ఇచ్చి సత్కరించారు. ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఆధ్వర్యంలో బుధవారం త్రిసభ్య కమిటీ చైర్మన్‌ల ప్రమాణ స్వీకారోత్సవాన్ని సంబంధిత సొసైటీ కార్యాలయాల్లో ఘనంగా చేపట్టనున్నారు.

నేడు ట్రాక్టర్లతో రైతుల సుఖీభవ ర్యాలీ

ఏలూరు/కొయ్యలగూడెం, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): రైతుల అభివృద్ధే లక్ష్యంగా సీఎం చంద్రబాబు పనిచేస్తున్నారని టీడీపీ మండలాధ్యక్షుడు గరిమళ్ల చలపతిరావు పేర్కొన్నారు. అన్నదాతా సుఖీభవ పథకం కింద రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేసినందుకు కృతజ్ఞతగా ఎమ్మెల్యే రోషన్‌కుమార్ ఆధ్వర్యంలో బుధవారం లింగపాలెంలోని ఎన్టీఆర్ విగ్రహం నుంచి ధర్మాజీగూడెం వరకు రైతులతో కలిసి ట్రాక్టర్లతో భారీ ర్యాలీ నిర్వహించనున్నట్టు తెలిపారు. నియోజకవర్గంలోని రైతులు, వివిధ అనుబంధ కమిటీలు, పార్టీ నాయకులు కార్యకర్తలు హాజరుకావాలని కోరారు. కొయ్యలగూడెం టీడీపీ మండలాధ్యక్షుడు పారేపల్లి నరేశ్ ఆధ్వర్యంలో నిర్వహించే ట్రాక్టర్ల దినోత్సవంలో ముఖ్య అతిథిగా రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాస్ పాల్గొననున్నారు. ఉదయం 9గంటలకు మార్కెట్ యార్డు నుంచి బయల్దేరి ప్రధాన సెంటర్ మీదుగా రేపల్లివాడ వరకు కొనసాగుతుందన్నారు.

మొరపెట్టుకున్న పట్టించుకోని అధికారులు

కొయ్యలగూడెం, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని కనకాద్రిపురం గ్రామంలో తాగునీటి పైపుల ద్వారా బురద వస్తోంది. కొద్దిరోజులుగా ఈ నీరు వస్తోందని ప్రజలు వాపోతున్నారు. బురద నీరు తాగలేక తాగునీరు కొనుగోలు చేయలేకపోతున్నామని వాపోయారు. రోజూ తాగునీరు కొనుగోలు చేయాలంటే ఎలా అని వేడుకుంటున్నారు. ఈగ్రామానికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న కుంతలగూడెం గ్రామం నుంచి పైపులైన్ల ద్వారా తాగునీరు వస్తుంది. బోరు పాడవటం వలనో మధ్యలో కలుషిత నీరు కలుస్తుందోకాని బురదనీరు వస్తుందని వాపోతున్నారు. అధికారులు తక్షణం స్పందించి ఈ సమస్యను పరిష్కరించాలన్నారు.

దళితులపై పోలీసుల దాడులు సరికాదు

బుట్టాయగూడెం, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): దళితులు, దళిత మహిళలపై దాడులు చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని, శ్మశానంలో అక్రమంగా నిర్మిస్తున్న రోడ్డును నిలిపివేయాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి అందుగుల ఫ్రాన్సిస్, సహాయ కార్యదర్శి బి.డేవిడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ డిప్యూటీ స్పీకర్ ఇలాకాలో దళితులపై పోలీసుల దాడులు అమానుషమన్నారు. ఉండి మండలం పాములపర్రులో రఘురామకృష్ణం రాజు వేస్తున్న రోడ్డును అడ్డుకున్న దళితులపై పోలీసులతో దాడులు చేయించడం దుర్మార్గమైన చర్య అన్నారు. దౌర్జన్యంగా నిర్మిస్తున్న రోడ్డుకు సీఐలు, ఎస్సైలు, ఏఎస్సైలు కాపలాకాయడం ఏమిటన్నారు. స్మశాన వాటిక కోసం పోరాటం చేస్తున్న దళితులకు కేవీపీఎస్ అండగా ఉంటుందన్నారు. దళిత హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత జోక్యం చేసుకుని దళితులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు.

విభిన్న ప్రతిభావంతులకు అండగా కూటమి ప్రభుత్వం

ఏలూరుటూటౌన్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): విభిన్న ప్రతిభావంతులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు.ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రజల నుంచి ఎమ్మెల్యే వినతులు స్వీకరించారు. ఒక దివ్యాంగురాలు తనకు ట్రైసైకిల్ కావాలని కోరినవెంటనే మంజూరు చేశారు. ఆమె వైద్య ఖర్చుల నిమిత్తం రూ.2 లక్షల విలువైన ఎల్‌వోసీ అందించారు. విభిన్న ప్రతిభావంతులు ఎవరైన ఎటువంటి సమస్యలున్న తన దగ్గరకి రావాలన్నారు. ఇప్పటికే చాలా వరకు అమలు చేశామన్నారు. రానున్న రోజుల్లో మిగిలిన హామీలు నెరవేరుస్తామన్నారు. ప్రజాహిత నిర్ణయాలే ప్రభుత్వ పాలనకు గీటురాయన్నారు.

సీఎం సహాయ నిధి పేదలకు వరం

ఏలూరు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): సీఎం సహాయ నిధి పేదలకు వరమని ఎమ్మెల్యే రోషన్ కుమార్ అన్నారు. లింగపాలెం మండలం కె.గోకవరం గ్రామానికి చెందిన కె.ఉదయ్‌భాస్కరశర్మకు, సుంకర ధర్మారావుకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సీఎం రిలీఫ్ ఫండ్ నిధులు అందిస్తున్నారని తెలిపారు. కె.గోకవరం గ్రామానికి చెందిన కూటమి నేతలు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు వినియోగించుకోవాలి

ఏలూరు అర్బన్/ఏలూరుటూటౌన్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకుని ప్రతి ఒక్కరూ విజ్ఞానాన్ని పొందాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎం.శేఖర్‌బాబు అన్నారు. జాతీయ గ్రంథాలయ దినోత్సవాన్ని పురస్కరించుకుని గ్రంథాలయ పితామహుడు డాక్టర్ ఎస్.ఆర్.రంగనాథన్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. డిప్యూటీ లైబ్రేరియన్ కే.నారాయణరావు, అసిస్టెంట్ లైబ్రేరియన్ సందీప్ కుమార్, లైబ్రేరియన్లు జ్యోతి, నగేశ్, ఎల్.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. ఏలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏపీ గ్రంథాలయ సంఘం ఆధ్వర్యంలో గ్రంథాలయ దినోత్సవం నిర్వహించారు. సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.వెంకటేశ్వరరావు, కళాశాల ప్రిన్సిపాల్ గిరిబాబు, అధ్యాపకులు పాల్గొన్నారు. స్థానిక సత్రంపాడులోని ఆదిత్య డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ వంగా వెంకటేశ్వరరావు, కళాశాల గ్రంథపాలకుడు పుప్పాల వీరభద్రరావు డిజిటల్ లైబ్రరీల గురించి వివరించారు.



ఐక్య నినాదాలు చేస్తున్న కార్మికులు

కార్మికులకు బీమా సౌకర్యం కల్పించాలి

చింతలపూడి, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ఆయిల్‌పామ్ కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి ఆయిల్‌పామ్ కార్మికులకు ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని ఆయిల్‌పామ్ కార్మిక సంఘ జిల్లా గౌరవాధ్యక్షులు పి.రామకృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం మార్కెట్ యార్డులో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ ఆయిల్‌పామ్ గెలలు నరికి లోడింగ్, అన్‌లోడింగ్ చేసే కార్మికుల సమస్యలు పరిష్కారం చేయాలన్నారు.ప్రమాదంలో గాయపడిన వారికి, చనిపోయిన వారికి ఎటువంటి న్యాయం జరగడంలేదని, ఇటీవల కాలంలో 35 సంవత్సరాలలోపు యువకులు జిల్లాలో 20 మంది యువకులు కరెంటు షాక్‌కు గురై చనిపోయారన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆయిల్‌పామ్ కార్మికులను గుర్తించి కార్మిక శాఖ ద్వారా గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. ఆయిల్‌పామ్ పంట పండించే రైతులకు రాష్ట్ర ప్రభుత్వం పంట నష్టపోతే పరిహారం అందిస్తుందని, కాని కార్మికులు మాత్రం ప్రమాదాలకు గురై వికలాంగులైనా పెన్షన్‌గాని, ఆర్థిక సహాయంగాని అందడంలేదని ఆరోపించారు. ఫ్యాక్టరీల నుంచి పది లక్షల రూపాయల గ్రూప్ ఇన్సూరెన్స్ ద్వారా ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలన్నారు. ఆర్.ఎస్. నారాయణ, పాండు రంగారావు, జి.వెంకట్రావు, డి.సత్యనారాయణ పాల్గొన్నారు.

దోమల నివారణకు అధికారుల చర్యలు

బుట్టాయగూడెం, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి):ఏజెన్సీ ప్రాంతాల్లో వైద్య ఆరోగ్యశాఖ అధికారులు దోమల నివారణ చర్యలు చేపట్టారు. దీనిలో భాగంగా మంగళవారం నందాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని రాచూరులో మురుగునీటిలో ఉండే దోమల గుడ్లను, దోమల పిల్లలను తినివేసేందుకు గంబుషియా చేపపిల్లలను అధికారులు విడుదల చేశారు. వైద్యాధికారి డాక్టరు మోహిత్, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ వి.పెద్దిరాజు, ఎంపిహెచ్ఎస్ వై.నరేష్, ప్రభాకర్, బాలాజీ, వెంకటేశ్వరరావు, రవీంద్ర పాల్గొన్నారు.

ఘనంగా శ్రావణ మాసం పూజలు

ఏలూరుకార్పొరేషన్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి):సత్రంపాడులోని స్వయంభూ శ్రీ సౌభాగ్యలక్ష్మీదేవి అమ్మవారి ఆలయం వద్ద శ్రావణ మాసోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం అమ్మవారికి విజయలక్ష్మీగా అలంకరించి ఆలయ అర్చకులు ఊటుకూరి నాగేశ్వరశర్మ భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి అభిషేకం నిర్వహించి అనంతరం విశేష అలంకరణ నిర్వహించి ప్రత్యేక హారతులిచ్చి ఆరాధించారు.



చల్లచింతలపూడిలో తిరంగా ర్యాలీ దృశ్యం



జీలుగుమిల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, నాయకులు



ఏలూరులో గృహ నిర్మాణ శాఖ ఆధ్వర్యంలో ర్యాలీ

దేశభక్తిని చాటిచెబుదాం

చింతలపూడి, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి):ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన పిలుపు మేరకు హర్‌ఘర్ తిరంగలో భాగంగా ప్రతీ ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి ఐక్యతను చాటాలని ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని సీతానగరం జడ్పీ హైస్కూల్ ఆవరణలో గ్రామంలోని దాతల సహకారంతో ఏర్పాటు చేసిన తొమ్మిది మంది జాతీయ నాయకుల బస్ట్ విగ్రహాలను ఆయన ఆవిష్కరించి విద్యార్థులకు సూచనలిచ్చారు.కూటమి నాయకులు జె.ముత్తారెడ్డి, కక్కిరాల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

● దెందులూరు: ప్రతి ఒక్కరూ జాతీయ జెండా ప్రాముఖ్యతను తెలుసుకుని ముందుకు సాగాలని బీజేపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు చౌటపల్లి విక్రమ కిషోర్ అన్నారు. దెందులూరు మండలం చల్లచింతలపూడి జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆజాదీకా అమృత్ మహోత్సవంలో భాగంగా హర్‌గర్ తిరంగా కార్యక్రమాన్ని నియోజకవర్గ బీజేపీ ఇంచార్జి గుమ్మడి వెంకటచైతన్య కృష్ణ, ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీని నిర్వహించారు. దెందులూరు మండలాధ్యక్షులు చీకటి లక్ష్మీ ప్రసన్న, హెచ్ఎం వడ్లపట్ల

ఇంటింటికీ జాతీయ జెండాను ఎగురవేయాలంటూ నాయకుల పిలుపు

విజయ్‌కుమార్ విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు.

● ఏలూరుకార్పొరేషన్: స్థానిక బావిశెట్టివారిపేటలోని ప్రజానీకం మంగళవారం జాతీయ జెండాలను చేతపట్టుకుని బ్యానర్లతో తిరంగ ర్యాలీ నిర్వహించారు. వివిధ సంఘాల నాయకులు, కార్యకర్తలు, మహిళలు అధిక సంఖ్యలో కార్యక్రమంలో పాల్గొన్నారు.

● ఏలూరు: దేశభక్తిని చాటుతూ ఏలూరు నగరంలో గృహ నిర్మాణ శాఖ హర్ ఘర్ తిరంగా ర్యాలీని మంగళవారం ఘనంగా నిర్వహించింది. ఈ ర్యాలీని ఆ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ జి.సత్యనారాయణ జెండా ఊపి ప్రారంభించారు. కార్యాలయం నుంచి కోర్టు సెంటర్, ఫైర్ స్టేషన్ సెంటర్, జడ్పీ కార్యాలయం మీదు హౌసింగ్ కార్యాలయం వరకు ఈ ర్యాలీలో ఉద్యోగులు, ఇంజనీర్లు, సిబ్బంది సాగారు. హౌసింగ్ పీడీ సత్యనారాయణ మాట్లాడుతూ స్వాతంత్ర్య స్ఫూర్తిని ప్రతీ ఒక్కరు నింపుకుని తమ ఇంటిపై భారత జాతీయ జెండాను ఎగురవేయాలని కోరారు.

● పోలవరం: బీజేపీ ఆధ్వర్యంలో పోలవరంలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. పోలవరం ప్రధాన రహదారుల్లో ప్రభుత్వ కళాశాల, ఉన్నతపాఠశాల విద్యార్థులతో జాతీయ పతాకాలతో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏటిగట్టు సెంటర్‌లో మానవ హారం నిర్వహించారు. బీజేపీ నేత కరిబండి నాగరాజు మాట్లాడుతూ విద్యార్థుల్లో జాతీయతా భావాన్ని పెంపొందించడానికి వారిలో దేశం కోసం ప్రాణాలర్పించిన దేశభక్తుల పట్ల గౌరవభావాలు దేశభక్తిని పెంచడానికి తిరంగా ర్యాలీ నిర్వహించినట్లు తెలిపారు. కూటమి నేతలు బొరగం వెంకటలక్ష్మి, గంటా శ్రీను, జల్లేపల్లి వెంకట నరసింహారావు, బెజవాడ వెంకటరమణ పాల్గొన్నారు.

● జీలుగుమిల్లి: భారతదేశ ఐక్యతను ప్రపంచ దేశాలకు చాటి చెప్పేదే హర్ ఘర్ తిరంగ యాత్ర అని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చాత్రాతి ప్రసాద్ అన్నారు. జీలుగుమిల్లి ప్రధాన సెంటర్ నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు తిరంగా ర్యాలీ నిర్వహించారు. మోదీ నాయకత్వంలో సైన్యం ఆపరేషన్ సిందూర్ నిర్వహించి పాకిస్థాన్‌కు తగిన గుణపాఠం చెప్పారన్నారు. మండల పార్టీ అధ్యక్షులు గుడ్ల రాంబాబు, సీనియర్ నాయకులు కొండపల్లి దుర్గాప్రసాద్, రేపాక గోపాలం, కోరుకొండ సూరిబాబు, భీమిరెడ్డి ప్రసాద్‌రెడ్డి, కేతిరెడ్డి నెహ్రూరెడ్డి, బుగ్గల శివరాం, ఉడా శ్రీనివాస్, సుబ్రహ్మణ్యం ఉన్నారు.

నులిపురుగులను నివారించాలి

ఏలూరు అర్బన్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): పిల్లల కడుపులో నులిపురుగుల సమస్యను నిర్మూలించే చర్యల్లో భాగంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, రాష్ట్రీయ బాలస్వస్థ కార్యక్రమం(ఆర్బీఎస్కే)సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా వ్యాప్తంగా చేపట్టిన ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ 94.98శాతం మంది విద్యార్థులకు పూర్తయింది. అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు, ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, ఐటీఐ, డిగ్రీ ప్రథమ సంవత్సరం వరకు చదువుతున్న విద్యార్థులు మొత్తం 3,76,263 మందికి నులిపురుగుల మాత్రలను వారివారి వయస్సులకు అనుగుణంగా హెల్త్ సూపర్‌వైజర్ల సమక్షంలో పంపిణీ చేయాలనే లక్ష్యంలో తొలి రోజున 3,59,163 మందితో మాత్రలను నమిలి లేదా చప్పరింపజేయడం ద్వారా మింగించినట్టు ఎన్సీడీ జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ నరేంద్రకృష్ణ మంగళవారం వెల్లడించారు. మాత్రల పంపిణీ విజయవంతమైందని, జిల్లాలో ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు నమోదు కాలేదని డీఎంహెచ్‌వో డాక్టర్ పీ.జే.అమృతం తెలిపారు. మంగళవారం మాత్రలను వేసుకోనివారి కోసం ఈ నెల 20న నిర్వహించనున్న మాప్‌అప్ డే సందర్భంగా ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేస్తామన్నారు. కాగా కలెక్టర్ వెట్రిసెల్వి క్యాంపు కార్యాలయం, సత్రంపాడు పాఠశాలల్లో పిల్లలకు మాత్రలను పంపిణీ చేయగా, డీఎంహెచ్‌వో తంగెళ్లమూడి ఐకేపీ సెంటర్, అంగన్‌వాడీ కేంద్రాల్లోను, ఎన్సీడీ డీపీఎం నూజివీడు, పవర్‌పేట అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు మాత్రలను పంపిణీచేశారు. మాత్రల పంపిణీని జిల్లాలో పర్యవేక్షించేందుకు ప్రభుత్వ నోడల్ ఆఫీసర్‌గా నియమితులైన డాక్టర్ శిరీష ఏలూరు, పెదపాడుల్లోని పలుచోట్ల పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

● ఉంగుటూరు:నారాయణపురం హైస్కూల్లో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారిణి శోభ ఆధ్వర్యంలో నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారు. పి.హెచ్.సి.

పాఠశాలల్లో విద్యార్థులకు మాత్రల పంపిణీ

వైద్యాధికారి డా.శ్రావణ్ రెడ్డి, డా.భూషణ్ పాల్గొన్నారు.

● నిడమర్రు: మండలంలో 36 ప్రాథమిక పాఠశాలలు, 7 ఉన్నత పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లో పెదనిండ్రకొలను వైద్యాధికారి కె.ఎస్.వర్మ ఆధ్వర్యంలో నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారు. నిడమర్రు మండలంలో 36 ప్రాథమిక పాఠశాలలు, 7 ఉన్నత పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లో నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారు. పెదనిండ్రకొలను ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో వైద్యాధికారి వర్మ పాల్గొని విద్యార్థులకు టాబ్లెట్లు పంపిణీ చేశారు. ఆరోగ్య విస్తరణ అధికారి కృపావరం, రత్నరాజు సూపర్‌వైజర్ చంద్రరావు, చిన్నితల్లి, సుశీల పాల్గొన్నారు.

● ఏలూరు: నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు తప్పకుండా వేసుకోవాలని లింగపాలెం పీహెచ్‌సీ వైద్యుడు కె.రాజశేఖర్ అన్నారు. లింగపాలెం మం డలం సింగగూడెం మోడల్ స్కూల్లో సులిపురుగుల నివారణా మాత్రలు పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయుడు పి.ఆంజనేయులు, కె.అర్జునరావు పాల్గొన్నారు.

● ఏలూరురూరల్: పిల్లలకు నులిపురుగుల మాత్రలు తప్పనిసరిగా ఇవ్వాలని మానూరు మండల పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం తేరా ప్రసాద్ అన్నారు. నులిపురుగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉపాధ్యాయురాలు టి.అరుణ ఆధ్వర్యంలో మాత్రలు పంపిణీ చేశారు. జాలిపూడి మండలప్రాథమికోన్నత పాఠశాలలో ఎంపీహెచ్‌వో ఉమామహేశ్వరరావు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సంధ్య పాఠశాల హెచ్ఎం జి.మోహన్ మాట్లాడుతూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. యు నిర్మల, మేరీ, రాణి పాల్గొన్నారు.

● కొయ్యలగూడెం: నులిపురుగుల మాత్రలు వేసుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సురేశ్ కుమార్ కోరారు. బయ్యన్నగూడెం పీహెచ్‌సీ పరిధిలోని వేదాం



టి.నరసాపురంలో మాత్రలు పంపిణీ చేస్తున్న దృశ్యం

తపురం జడ్పీ పాఠశాలలో నులిపురుగు మాత్రలు పంపిణీ చేశారు. ఆరోగ్య విస్తర్ణాధికారి సుబ్రహ్మణ్యం, హెచ్ఎం పీవీ.నారాయణ ఉన్నారు.

● భీమడోలు: ప్రతి పాఠశాలలో విద్యనభ్యశించే విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు అందేలా వైద్య సిబ్బంది పని చేయాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి వైద్యురాలు శోభ ఆదేశించారు. నులిపురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా గుండుగొలను ప్రాథమిక వైద్య కేంద్రం పరిధిలోని పలు ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలలో జరిగిన నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీని పరిశీలించారు. పూళ్ళ ప్రాథమిక వైద్య కేంద్రం పరిధిలో మాత్రలు పంపిణీ జరిగింది.

● టి.నర్సాపురం:మర్రిగూడెం ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రం పాఠశాలలో జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా చింతలపూడి మలేరియా సబ్ యూనిట్ అధికారి ఎస్‌ఏ ప్రసాద్ ఆధ్వర్యంలో మంగళవారం నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారు. సబ్‌యూనిట్ హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసరావు, ఎంఎల్‌హెచ్ పీ.రోహిణి, వీహెచ్ ఎస్.విజయశాంతి, ఆశాలు లావణ్య, గంగా పాల్గొన్నారు.

● బుట్టాయగూడెం: ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు మనేంద్రరావు ఆధ్వర్యంలో విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారు. ప్రిన్సిపాల్ పలు సూచనలు చేశారు. ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ డాక్టర్ సాకే అక్కులన్న, అధ్యాపకుడు మర్రి వెంకటేశ్వరరావు, వైద్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణుల హర్షం

దెందులూరు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): సెలూన్ దుకాణాలు నిర్వహించుకునే నాయీ బ్రాహ్మణులకు 200 యూనిట్ల విద్యుత్‌ను అందిస్తామని ప్రకటించడం పట్ల సీఎం, డిప్యూటీ సీఎంలకు నాయీ బ్రాహ్మణ సాధికార సంఘం జిల్లా అధ్యక్షులు కొప్పెర్ల నాగరాజు కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గ యూనియన్ అధ్యక్షుడు కొప్పాక వెంకటేశ్వరరావు(కొండ) ఆధ్వర్యంలో సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఎన్టీఆర్ విగ్రహానికి సంఘ ఉపాధ్యక్షుడు కొక్కిరిపాటి సురేశ్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. తిరుమలలో పని చేస్తున్న క్షవరులకు నెలవారీ వేతనం రూ.20 వేల నుంచి 25 వేలు పెంచినందుకు కృతజ్ఞతలు తెలుపుతూ చింతమనేని ఘనంగా సన్మానించారు.

● చింతలపూడి: కూటమి ప్రభుత్వం మానిఫె



క్షీరాభిషేకం చేస్తున్న టీడీపీ నాయకులు

స్టోలో ప్రకటించిన విధంగా నాయీ బ్రాహ్మణుల సెలూన్‌లకు 200యూనిట్‌లకు ఉచిత విద్యుత్ పెంచి ప్రకటించినందుకు హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే చేతుల మీదుగా కేక్ కట్ చేసి అభినందనలు తెలిపారు. దీనిపై ఎమ్మెల్యే రోషన్ మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తుందన్నారు. నాయీ బ్రాహ్మణ జిల్లా నాయకులు కొప్పెర్ల నాగరాజు, నియోజకవర్గ నాయకులు కె.వెంకటేశ్వరరావు, సీతారాములు, నందిగం వెంకటేశ్వరరావు, కె.సురేష్, ఎన్.సత్యనారాయణ పాల్గొన్నారు.

బైపాస్ రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలి

కామవరపుకోట, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ఏలూరు-జంగారెడ్డిగూడెం ప్రధాన రహదారిలోని కామవరపుకోట మండలం ఆడమిల్లి గ్రామ సచివాలయం నేపథ్యంలో గత నెలలో కూలిన పాత వంతెన స్థానంలో నిర్మాణం చేపట్టిన బైపాస్ రోడ్డు నిర్మాణం త్వరిత గతిన పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు. వంతెన కుంగిన నేపథ్యంలో ట్రాఫిక్‌ను ఆడమిల్లి నుంచి వెంకట కృష్ణాపురం, ద్వారకాతిరుమల మీదుగా వాహనాల రాకపోకలు జరుగుతున్నాయి. దీంతో తీవ్ర జాప్యం జరుగుతుందని, కాలయాపన అవుతుందని, వెంటనే నిర్మాణంలో ఉన్న బైపాస్ రోడ్డును త్వరితగతిన పూర్తి చేసి రాకపోకలను కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని వాహనదారులు అభ్యర్థిస్తున్నారు.

ఆర్టీసీ అపరిష్కృత సమస్యలు పరిష్కరించాలి

ఏలూరు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): గ్యారేజ్ ఉద్యోగుల అపరిష్కృత సమస్యలను వెంటనే పరిష్కరించాలని, పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను తక్షణమే చెల్లించాలని కోరుతూ ఏపీ పీటీడీ నేషనల్ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో ఏలూరు ఆర్టీసీ డిపో ధర్నా మంగళవారం జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎన్ఎంయూ ఏలూరు జిల్లా అధ్యక్షులు జి.రామారావు మాట్లాడుతూ ఆర్టీసీ ఆస్తులను బడా కంపెనీలకు దారాదత్తం చేయాలని చూస్తే ఊరుకొనేది లేదని హెచ్చరించారు. గవర్నర్‌పేట్ ఆర్టీసీ స్థలాలు లీజులకిచ్చే అంశాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. వేతన సవరణ అయిపోయి రెండేళ్ల అవుతున్నా ఇప్పటికీ ఐఆర్ ప్రకటించలేదని, తక్షణమే పీఆర్సీ కమిషన్‌ను ఏర్పాటు చేయాలన్నారు. జోనల్ చీఫ్ వైస్ ప్రెసిడెంట్ ఎస్ ప్రసాదరావు మాట్లాడుతూ ఈహెచ్ఎస్ స్థానంలో పాత వైద్య



ధర్నాలో మాట్లాడుతున్న రామారావు

విధానాన్ని పునరుద్ధరించాలని, ఉద్యోగులకు అనారోగ్య సెలవులకు పూర్తి జీతం చెల్లించాలని, మహిళా ఉద్యోగులకు ప్రభుత్వ జీవో ప్రకారం పిల్లల సంరక్షణ సెలవు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రెండురోజుల పాటు నిరసనలు తెలుతున్నట్లు ఆయన తెలిపారు. జోనల్ వైస్ ప్రెసిడెంట్ భారతి, డిపో కార్యదర్శి పి శ్రీనివాసరావు, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ పద్మజ పాల్గొన్నారు.

వాహనదారులు హెల్మెట్ ధరించాలి

పెదపాడు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి):వాహనదారులంతా తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని నడపాలని పెదపాడు ఎస్.ఐ. కట్టా శారదా సతీశ్ సూచించారు. కలపర్రు టోల్ గేట్ వద్ద డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించి, మద్యం తాగి వాహనాన్ని నడుపుతున్న వారిపై కేసులు నమోదు చేశారు. అనంతరం ద్విచక్రవాహనదారులకు హెల్మెట్ గురించి అవగాహన కల్పించారు.

బెంబేలెత్తిస్తున్న వీధి కుక్కలు



కామవరపుకోట, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో వీధి కుక్కల బెడద అధికంగా ఉందని ప్రజానీకం అభ్యర్థిస్తున్నారు. ప్రతీ వీధిలో కుక్కలు అధికంగా సంచరిస్తుండడంతో ఎటువంటి ప్రమాదాలు జరుగుతాయోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వీధి కుక్కలను నిర్మూలించాలని స్థానికులు కోరుతున్నారు.

సొసైటీ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తా

పెదపాడు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): సొసైటీ, సంఘ సభ్యుల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని పెదపాడు సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్‌గా 5వసారి మంగళవారం బాధ్యతలు చేపట్టిన గారపాటి స్టాలిన్ పేర్కొన్నారు. గారపాటి స్టాలిన్‌ను ఏఎంసీ చైర్మన్ గారపాటి రామసీత, క్లస్టర్ ఇంచార్జి గుత్తా అనిల్, డీసీ అధ్యక్షులు బొప్పూడి కాశీబాబులతో పాటుగా పలువురు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. చైర్మన్ స్టాలిన్ మాట్లాడుతూ 1992 నుంచి 2019 వరకు నాలుగుసార్లు సొసైటీ అభివృద్ధికి, విత్తన ప్రాసెసింగ్, గొడౌన్ల నిర్మాణానికి తనవంతు కృషి చేశానన్నారు. ఏటా రూ.35 కోట్ల టర్నోవర్‌తో 1200 మెట్రిక్ టన్నుల నాణ్యమైన వరి విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచడం జరుగుతుందని స్టాలిన్ తెలిపారు. సీఈవో డీవీ సుబ్బారావు, మెంబర్లు ఖండవల్లి కాలేబు, పిల్లగోళ్ల సురేష్, ఖండవల్లి జరహో, వడ్లపట్ల వెంకటేశ్వరరావు, ధనుంజయరావు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

నర్సింగ్ కళాశాల విద్యార్థుల ర్యాలీ

దెందులూరు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ దేశ గౌరవాన్ని పెంపొందించేలా కృషి చేయాలని దెందులూరు నర్సింగ్ కళాశాల కరస్పాండెంట్ సుగ్గిశెట్టి నూకరాజు అన్నారు. మంగళవారం నర్సింగ్ విద్యార్థులతో 161 అడుగుల జాతీయ జెండాతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఆజాదీకా అమృత్ మహోత్సవంలో భాగంగా హర్‌గర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ర్యాలీని దెందులూరు సంతపేట, అంబేర్కర్ సెంటర్, నూపాటి దిబ్బ, నాలుగు రోడ్ల కూడలి, లైబ్రరీ సెంటర్ ఎన్టీఆర్ సెంటర్‌ల మీదుగా నిర్వహించారు. నర్సింగ్ కళాశాలలో 6వేల జెండాలను విద్యార్థుల ఉచితంగా అందించారు. నర్సింగ్ కళాశాల డైరెక్టర్ సుగ్గిశెట్టి పద్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చికెన్ వ్యర్థాల వాహనం పట్టివేత

పెదపాడు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): చేపల చెరువుల్లో మేతగా వేసేందుకు చికెన్ వ్యర్థాలు తరలిస్తున్న ఐషర్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్టు పెదపాడు ఎస్.ఐ. కట్టా శారదా సతీశ్ తెలిపారు. వాహన యజమాని, డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్టు ఎస్.ఐ. తెలిపారు.

సోమసుందర్ ఎన్నిక పట్ల హర్షం

చింతలపూడి, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి):ఆలిండియా వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ (ఐజేయూ) జాతీయ ప్రధాన కార్యదర్శిగా డి.సోమసుందర్ ఎన్నికవడం పట్ల సీపీఐ మండల నాయకులు హర్షం వ్యక్తం చేశారు.మండల నాయకుడు టి.బాబు మాట్లాడుతూ ఐజేయు జాతీయ కార్యదర్శిగా ఎన్నికవడం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాకు గర్వకారణమన్నారు. సీపీఐ నాయకులు ఎం.వసంతరావు, కంచర్ల గురవయ్య, పి.సోమశేఖర్ ఉన్నారు.

వీరాంజనేయుడికి సింధూరార్చన

ఏలూరుకార్పొరేషన్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): శ్రావణ మంగళవారం నేపథ్యంలో సత్రంపాడులోని అంబికాదేవి ఆలయ ప్రాంగణంలో వీరాంజనేయస్వామి ఆలయం వద్ద భక్తులు సింధూరం, తమలపాకులతో స్వామివారికి అర్చనలు జరిపారు. భక్తులు వడమాలలు సమర్పించారు. హనుమాన్‌చాలీసా పారాయణ నిర్వహించారు. ఆలయ అర్చకులు శ్రీనివాసుల శ్రీనివాస చార్యులు భక్తులతో వారి గోత్రనామాలతో అర్చనలు జరిపారు. ఈ మేరకు ఆలయం వద్ద భక్తుల సందడి నెలకొంది.

అంబికా ఆలయంలో వ్రతాలు

ఏలూరుకార్పొరేషన్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసం సందర్భంగా సత్రంపాడులోని అంబికాదేవి ఆలయ ప్రాంగణంలో ఆలయ ప్రధానార్చకులు వారణాసి రామవేంద్రశర్మ మహిళలతో సామూహికంగా మంగళ గౌరీ వ్రతాలు జరిపించారు. ఈ సందర్భంగా తొలుత అమ్మవారికి పంచామృతాభిషేకం జరిపి అనంతరం విశేష అలంకరణ నిర్వహించి ప్రత్యేక హారతులిచ్చి నివేదనలు సమర్పించారు. ఆలయ మేనేజర్ ఓగిరాల మల్లికార్జునరావు, మిత్రబృందం భక్తులకు సేవలు అందించారు.

వంతెన విస్తరించాలి

ఏలూరుకార్పొరేషన్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): మినీ బైపాస్ రోడ్డులోని హనుమాన్‌నగర్ వంతెనను విస్తరించాలని సీపీఎం నగర కార్యదర్శి పంపన రవికుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఈ వంతెన మినీ బైపాస్ రోడ్డు కంటే ఎత్తుగా ఉండడంతో రాకపోకలకు అసౌకర్యంగా ఉందని, పెరిగిన రద్దీ దృష్ట్యా వెడల్పు చేయాలని కోరారు.

ఉచిత బస్సు ప్రయాణం కల్పించండి

ఏలూరుకార్పొరేషన్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఈ నెల 15వ తేదీ నుంచి ప్రవేశపెడుతున్న స్త్రీ శక్తి పథకంలో దివ్యాంగులను కూడా చేర్చాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక ఏలూరు జిల్లా కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు సంఘ జిల్లా గౌరవ అధ్యక్షులు బి.సోమయ్య, అధ్యక్షులు కుందేటి జయరాజు, కార్యదర్శి సుభాషిణిలు మంగళవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని అవయవాలు సవ్యంగా ఉన్న వారికి ఇచ్చే ప్రోత్సహాకాన్ని దివ్యాంగులకు వర్తింపచేయాలని కోరారు.

రజకుల సమస్యలు పరిష్కరించాలి

ఏలూరురూరల్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు కూటమి నాయకులు రజకులకు ఇచ్చిన హామీలను అమలు చెయ్యాలని రజక జన సంఘ జిల్లా అధ్యక్షుడు చిలకపల్లి కట్లయ్య ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఏలూరులోని రజక జన సంఘ కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. కట్లయ్య మాట్లాడుతూ రజకుల సమస్యల పట్ల నిర్లక్ష్యం తగదన్నారు. అనంతరం సరిపల్లె, గణపవరం గ్రామాల రజకుల నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. అధ్యక్షుడిగా జి.నరసింహమూర్తి, కార్యదర్శిగా బి.పుల్లయ్య, ఉపాధ్యక్షుడిగా శివరాంబాబు ఎన్నికయ్యారు.

కొవ్వలి పాఠశాల పరిశీలన

దెందులూరు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): మండలంలో కొవ్వలి జడ్పీ ఉన్నత పాఠశాల పీఎంశ్రీకి ఎంపికైన సందర్భంగా జడ్పీ సీఈవో శ్రీహరి కొవ్వలి హైస్కూల్‌ను పరిశీలించారు. కొవ్వలి హైస్కూల్లోని క్రీడా ప్రాగణం, మధ్యాహ్న భోజనం, మరుగుదొడ్లను పరిశీలించారు. ఉన్నత పాఠశాల హెచ్ఎం శర్మను వివరాలడిగి తెలుసుకున్నారు. విద్యా కమిటీ చైర్మన్ బీదా గణేశ్ కుమార్, టీడీపీ నాయకులు కనుకుర్తి రామకృష్ణ, పాఠశాల ఇన్‌చార్జి పి.జాన్‌బాబు ఉన్నారు.



స్మార్ట్ మీటర్లు వ్యతిరేకిద్దాం

ఉంగుటూరు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వ్యతిరేకిస్తూ కైకరంలో మంగళవారం సి.పి.ఎం నాయకులు ఆందోళన నిర్వహించారు. పార్టీ జిల్లా కమిటీ సభ్యులు నారపల్లి రమణారావు మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉండగా లోకేశ్ మీటర్లు బద్దలు కొట్టండని పిలుపునిచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. నాయకులు గుత్తికొండ వెంకట కృష్ణారావు,కోనే రాము,చిత్తా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పంటల బీమా చేయించుకోవాలి

జీలుగుమిల్లి, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): రైతులు పంటల బీమా చేయించుకోవాలని ఏవో కె.గంగాధరం అన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా స్వర్ణవారిగూడెం, దర్బగూడెం గ్రామాల్లో మంగళవారం రైతులతో సమావేశాలు నిర్వహించారు. వరి రైతులు రూ.810 పంటల బీమా 15వ తేదీ లోపు చెల్లించాలన్నారు.

నేడు గంగానమ్మ విగ్రహ ప్రతిష్ఠ

ముదినేపల్లి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపల్లి గ్రామంలో గంగానమ వారి విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయం వద్ద వాస్తుహోమం, జలాధివాసం, ధాన్యాధివాసం ఇతర పూజలను యాజ్ఞికుడు ఆసూరి రంగనాథాచార్యులు నిర్వహించారు. గ్రామస్థులు పెద్ద సంఖ్యలో హోమ కార్యక్రమాల్లో పాల్గొని పూజలు నిర్వహించారు. 13వ తేదీ బుధవారం ఉదయం 8.39 గంటలకు ఆలయంలో అమ్మవారి విగ్రహం ప్రతిష్ఠ జరగనుంది.

బాలసదన్ విద్యార్థుల తరలింపు

నూజివీడు టౌన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): బాలసదన్‌లో ఆవాసం పొందుతున్న విద్యార్థులను సురక్షిత ప్రాంతానికి తరలించినట్లు సీడీపీవో విజయకుమారి అన్నారు. బాలసదన్ భవన్ ప్రస్తుతం అద్దె భవనంలో నడుస్తోందని, అది మరమ్మతులకు గురికావడంతో చిన్నారుల రక్షణను దృష్టిలో పెట్టుకుని సురక్షిత ప్రాంతానికి తరలించే ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ప్రస్తుతం 24మంది చిన్నారులు బాలసదన్‌లో ఉన్నట్లు ఆమె తెలిపారు.



విద్యుత్ సిబ్బందికి సూచనలిస్తున్న విజిలెన్స్ ఈఈ విజయ్‌కుమారి

విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కఠిన చర్యలు

నూజివీడు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు భారీ అపరాధ రుసుం చెల్లించాల్సి ఉంటుందని విద్యుత్ విజిలెన్స్ ఈఈ విజయ్‌కుమారి హెచ్చరించారు. ట్రాన్స్‌కో ఈఈ ఏ.సత్యనారాయణ నేతృత్వంలో నూజివీడు రూరల్ సెక్షన్ పరిధిలోని అన్నవరం, పోతురెడ్డిపల్లి, మిట్టగూడెం, హనుమంతులగూడెం తదితర గ్రామాల్లో విద్యుత్ విజిలెన్స్ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. సుమారు 37 బృందాలుగా ఏర్పడి, తనిఖీలు నిర్వహిస్తూ 3032 గృహ సర్వీసులు, 117 వాణిజ్య సర్వీసులను తనిఖీ చేశారు. వీటిలో విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న 161 మందిని గుర్తించి అపరాధ రుసుముగా రూ.5,40,000లు అదనపు లోడ్ కింద విధించారు. 14 మంది ఏఈలు, నలుగురు డీఈలు, లైన్‌మెన్ పాల్గొన్నారు.

ప్రభుత్వ లక్ష్యాలను సాధించాలి : డీపీవో



కరపత్రాలను అందజేస్తున్న డీపీవో అనూరాధ

ముసునూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ లక్ష్యాలను నేరవేర్చేలా పని చేయాలని జిల్లా పంచాయతీరాజ్ అధికారి కె.అనూరాధ అధికారులను ఆదేశించారు. వేల్పుచర్లలో ఇంటింటా చెత్త సేకరణను మంగళవారం ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చెత్త సేకరణ, పారిశుధ్యం, మౌలిక సదుపాయాలపై స్థానికుల నుంచి వివరాలను సేకరించారు. అనంతరం పంచాయతీ ఆధ్వర్యంలో స్వచ్ఛ గ్రామ సాధనపై ముద్రించిన కరపత్రాలను ఆమె పంపిణీ చేసి, సంపద కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ భారత్‌లో భాగంగా జరుగుతున్న చెత్త సేకరణపై ప్రజల నుంచి ఫిర్యాదు వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. తడి, పొడి చెత్తలను సంపద కేంద్రాలకు తరలించి, పంచాయతీకి ఆదాయ వనరులను సమకూర్చేలా వర్మీ కంపోస్ట్ తయారు చేయాలని సూచించారు. అలాగే ప్రభుత్వం నూతనంగా చేపట్టిన స్వామిత్వ సర్వేను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. ఎంపీడీవో బీపీ సత్యనారాయణ, కార్యదర్శి శ్రీనివాస చౌదరి తదితరులు పాల్గొన్నారు.

'విలువల విద్య' పుస్తకాల పంపిణీ

ముసునూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు విద్యతోపాటు విలువలు నేర్పించాలనే సత్సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు చాగంటి కోటేశ్వరరావు రూపొందించిన విలువల విద్య పుస్తకాలను ప్రభుత్వం ఇచ్చిందని ప్రధానోపాధ్యాయుడు రామకృష్ణ అన్నారు. మంగళవారం రమణక్కపేట జడ్పీ పాఠశాల విద్యార్థులకు ఆయన పుస్తకాలను అందజేసి మాట్లాడుతూ ఈ పుస్తకంలో విద్యార్థులకు సంస్కార విషయాలు, శతక సాహిత్యంలోని తెలుగు పద్యాలు, ఆరు కథలను రూపొందించారని తెలిపారు. పదో తరగతికి అమృతధార, తొమ్మిదో తరగతికి సద్గుణసారం, ఎనిమిదికి సూక్తి సుధ, ఏడవ తరగతికి మనో వికాసం, ఆరవ తరగతికి తోరణాలు అనే పేరుతో ప్రభుత్వం పుస్తకాలను ముద్రించిందని చెప్పారు. చాగంటి కోటేశ్వరరావు, సీఎం, మంత్రి నారా లోకేశ్‌కు విద్యార్థులు, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు.



వృద్ధురాలికి 'మేము సైతం' చేయూత

ముదినేపల్లి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలం పెయ్యేరు వైఎస్ఆర్ కాలనీలో తీవ్ర అనారోగ్యంతో పనులు చేయలేక జీవనోపాధి లేక ఇబ్బందులు పడుతున్న రావూరి అమ్మాజీ అనే వృద్ధురాలికి స్థానిక మేము సైతం టీము ఆదుకుంది. మంగళవారం టీం సభ్యులు దాకరం సర్పంచ్ జాన్సి రాజా, పాస్టర్ ఉచ్చుల విజయ కుమార్, మొవ్వ ఫణీంద్ర, భూపతి రవీంద్ర, బందుల విజయ సాగర్, దాసరి ప్రకాష్, స్వర్గన్ రాజు తదితరులు వృద్ధురాలికి బియ్యం, నెలకు సరిపడా నిత్యావసర సరుకులు, నగదు అందజేశారు.

పరీక్షలు తనిఖీ చేసిన ఎంఈవో-2

చాట్రాయి, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని చనుబండ జడ్పీ హైస్కూల్‌లో జరుగుతున్న బుక్‌లెట్ ఎఫ్ఏ-2 పరీక్షలను మంగళవారం ఎంఈవో-2 వీయస్వీ బ్రహ్మాచారి పరిశీలించారు. నూతన పరీక్షా విధానంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. హెచ్ఎం రవీంద్రనాథ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'భోజనం' రుచిగా లేదు..

చాట్రాయి జడ్పీ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజన పథకాన్ని మంగళవారం ఎంఈవో-1 శ్రీనివాస్ తనిఖీ చేశారు. భోజనం నాణ్యతపై విద్యార్థుల అభిప్రాయాలు కోరగా రుచి, పరిశుభ్రత లేదని చెప్పారని, దీనిపై ఉన్నతాధికారులకు నివేదిక పంపుతానని ఎంఈవో-1 శ్రీనివాస్ తెలిపారు.

సామూహిక కుంకుమ పూజలు

కైకలూరు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): శ్రావణమాస మహోత్సవాల సందర్భంగా కైకలూరు శ్రీ శ్యామలాంబ అమ్మవారి ఆలయంలో సామూహిక కుంకుమ పూజలను వైభవంగా నిర్వహించారు. మంగళవారం అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఎండోమెంట్ ఆధ్వర్యంలో సామూహిక కుంకుమ పూజలు, శ్రీమన్నారాయణ గోష్టి అధ్యక్షురాలు చిట్టి హేమలత బృందం, పెద్దయెత్తున మహిళలు పెద్దఎత్తున తరలివచ్చి కుంకుమార్చనలో పాల్గొన్నారు. ఆలయ ఈవో శేఖర్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ప్రతి ఇంటా జాతీయ జెండా ఎగరాలి

సమరయోధుల త్యాగాలను నేటి తరానికి తెలపాలి : ఎంపీపీ

కైకలూరు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవం నాడు ప్రతి ఇంటిపైన జాతీయజెండా ఎగరాలని ఎంపీపీ అడవి కృష్ణ అన్నారు. మంగళవారం కైకలూరులో జాతీయ జెండాలను పంపిణీ చేసి మాట్లాడుతూ ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ సహకారంతో హర్ ఘర్ తిరంగా అభియాన్ ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ దేశం కోసం ప్రాణాలర్పించిన స్వాతంత్ర్య సమరయోధులను గుర్తుచేసుకుంటూ భావితరాలకు వారి పోరాట స్ఫూర్తిని తెలియజేయాలన్నారు. కిసాన్‌మోర్చ జిల్లా అధ్యక్షుడు కీర్తి వెంకట రాంప్రసాద్, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ లంకా రత్నారావు, బీజేపీ మండల అధ్యక్షుడు బోడావుల జగదీష్, బీజేపీ నాయకులు పేరిచర్ల ప్రసాదరాజు, గరికిపాటి రాంబాబు, బొల్లా శ్యామలారావు, నాంచారయ్య, తదితరులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	105, 113, 124
చికెన్ విత్ స్కిన్	200
చికెన్ స్కిన్‌లెస్	210
నెక్ కోడి గుడ్డు ధర	(100)
విజయవాడ జోన్ రైతు ధర	రూ.475



ముదినేపల్లిలో ఎరువుల షాపు వద్ద యూరియా కోసం రైతుల పడిగాపులు

యూరియా ఏదయా..?

ఎరువుల దుకాణాల వద్ద రైతుల పడిగాపులు

ముదినేపల్లి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలంలో యూరియా ఎరువు కొరత తీవ్రంగా ఏర్పడింది. సార్వా వరి పైరుకు అత్యంత అవసరమైన ప్రస్తుత సమయంలో యూరియా కొరత ఏర్పడటం రైతులను ఆందోళనకు గురి చేస్తున్నది. మండలంలో సుమారు 15 వేల ఎకరాల ఆయకట్టులో సార్వా వరి సాగు చేస్తుండగా, ఎక్కువ శాతం వెదజల్లిన వరి పైరుకు తొలి విడత యూరియా వాడకం పూర్తయింది. రెండవ విడత చల్లేందుకు యూరియా కొరత ఏర్పడింది. వరి నాట్లు వేసిన భూములకు కూడా ఆ ఎరువు అవసరమైన ప్రస్తుత పరిస్థితుల్లో యూరియా లభించకపోవటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుత అవసరాలను బట్టి ముదినేపల్లి మండలానికి సుమారు 150 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం. ఈ మేరకు సహకార సంఘం సీఈవోలు వ్యవసాయ శాఖకు ఇండెంట్లు కూడా పంపారు. డిమాండ్‌కు సరిపడా సప్లయి లేక రైతులు ఆందోళన చెందుతున్నారు. గతంలో ఏనాడు లేని విధంగా మండలంలోని ఎరువుల షాపుల వద్ద యూరియా కోసం రైతులు పడిగాపులు పడుతున్నారు. సోమవారం మండలంలోని అయిదు షాపులకు 15 టన్నుల యూరియా రాగా, గంట వ్యవధిలోనే అమ్ముడు పోయింది. మంగళవారం దేవపూడి సొసైటీకి 12 టన్నుల యూరియా రాగా, వెంటనే అమ్మకాలు జరిగిపోయాయి. ఇండెంట్‌కు సరిపడా యూరియా రాకపోవటంతో షాపుల్లో అమ్మకాలు ఎలా నిర్వహించాలన్నది డీలర్లకు ఇబ్బందికరంగా ఉంది. ఎంత అవసరం ఉన్నా ఒక్కో రైతుకు ఒక్క యూరియా బస్తా అమ్ముతూ సరిపెట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ యూరియా కొరతను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు.

చర్యలు తీసుకుంటున్నాం: ఏవో

యూరియా కొరతను అధిగమించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ముదినేపల్లి ఏవో వేణుమాధవ్ తెలిపారు. సహకార సంఘాలకు కూడా యూరియా కేటాయింపులు పెంచేందుకు ఉన్నతాధికారులతో మాట్లాడుతున్నామని, ప్రస్తుతం డిమాండ్‌కు సరిపడా రానందున కేటాయించిన యూరియాను సర్దుబాటు చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ వై. శ్రీలత

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

కైకలూరు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలని, విద్యార్థులు వాటిని సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలను చేరుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ వై. శ్రీలత అన్నారు. మంగళవారం కైకలూరు వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ గ్రంథపాలకుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయోద్యమంలో ప్రముఖ పాత్ర పోషించిన ఎస్ఆర్ రంగనాథన్ జయంతిని పురస్కరించుకొని ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కేదారి, గ్రంథపాల కుడు పి. వేదాంతం, అధ్యాపకులు పాల్గొన్నారు.

కలిదిండి: పద్మశ్రీ ఎస్.ఆర్. రంగనాథన్ జయంతి సందర్భంగా కలిదిండి శాఖా గ్రంథాలయంలో మంగళవారం ఆయన చిత్రపటానికి గ్రంథాలయా. దికారి జె.రమేష్‌బాబు, విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.





కైకలూరులో కృతజ్ఞతా ర్యాలీ.. చెక్కపల్లిలో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయీ బ్రాహ్మణులు

'నాయీ బ్రాహ్మణుల సంక్షేమానికి కూటమి కృషి మహోన్నతం'

కైకలూరు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): నాయీ బ్రాహ్మణుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వ కృషి మహోన్నతమైనదని రాష్ట్ర నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ లంకా రత్నారావు అన్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నాయీ బ్రాహ్మణుల దుకాణాలకు 200 యూనిట్లు విద్యుత్ ఉచితంగా అందించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ మంగళవారం కైకలూరు తాలుకా సెంటర్లోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద చంద్రబాబు, లోకేశ్, పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. అనంతరం కృతజ్ఞత ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్, అంబేడ్కర్ విగ్రహాలకు నివాళులర్పించి మాట్లాడుతూ నాయీ బ్రాహ్మణ సామాజిక వర్గానికి ఒక ఎమ్మెల్సీ పదవిని కేటాయిస్తానని గతంలోనే ప్రకటించారని దానిని అమలు చేయాలని కోరారు. నియోజకవర్గ అధ్యక్షుడు విజయకుమార్, సంఘ నాయకులు పాల్గొన్నారు.

ముసునూరు: నాయీ బ్రాహ్మణుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జ్ తల్లిబోయిన సత్యనారాయణ, నాయీ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు పోతునూరి సుబ్బారావులు అన్నారు. ప్రభుత్వం బార్బర్ షాపులకు 200 యూనిట్లు వరకు విద్యుత్ ఉచితమని ప్రకటించడంపై మంగళవారం చెక్కపల్లి నాయీ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. నాయీ బ్రాహ్మణులను ఆర్థికంగా బలోపేతం చేయడానికి కృషి చేస్తున్న సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. సంఘం ఉపాధ్యక్షులు కొక్కిరపాటి మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



పంట కాలువలో చెత్త తొలగింపు

కైకలూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): కైకలూరు పంటకాలువలోని చెత్త తొలగింపు పనులను నిర్వహిస్తున్నట్లు డీసీ చైర్మన్ పొత్తూరి వాసురాజు తెలిపారు. మంగళవారం గోనెపాడు పంటకాలువలో ఎక్స్‌కవేటర్లతో చెత్త తొలగింపు పనుల నిర్వహణను పరిశీలించి మాట్లాడుతూ కాలువలకు పూర్తిస్థాయిలో నీరు విడుదల చేసినందున శివారు ప్రాంతాలకు వెళ్లేలా ఎక్కడికక్కడే కాలువ అభివృద్ధి పనులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ సూచనల మేరకు నీటి సంఘాలు పర్యవేక్షణలో ఈ తవ్వకాలు చేపడుతున్నామన్నారు.

ప్రతి ఒక్కరూ జాతీయ జెండా ఎగురవేయాలి

మండవల్లి, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): కులమతాలకతీతంగా ప్రతి ఒక్కరూ జాతీయజెండాను ఎగురవేయాలని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్ఎస్ భాస్కరరావు, జిల్లా కన్వీనర్ టి. అప్పారావు పేర్కొన్నారు. హర్ ఘర్ తిరంగా ప్రచారంలో భాగంగా మండవల్లి గ్రంథాలయం వద్ద ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ సహకారంతో అందించిన జాతీయ జెండాలను ఆవిష్కరించారు. ఆగస్టు 15న ప్రతీ ఇంటిపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయడం ద్వారా దేశ పౌరులంతా ఒకే తాటిపై ఉన్నారని అందరూ సమానమని చాటి చెప్పవచ్చని తెలిపారు. తద్వారా ప్రజలందరి మధ్య సమానత్వం, ఐకమత్యం మరింత పెంపొందుతు న్నారు. 95 శాతం ప్రజలకు రాజ్యాంగం, ఎన్నికలపై కనీస అవగాహన లేదని వాపోయారు. దేశం 79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకుంటున్నప్పటికీ స్వాతంత్ర్య ఫలాలు అందరికి సమానంగా అందటం లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ అధ్యక్షుడు గంజాల శ్రీనివాసరావు, ఎర్రంశెట్టి శ్రీనివాసరావు, బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు బండి దివాకర్, గ్రంధాలయ అధికారిని షేక్ పర్వీన్, కానుకొల్లు బుక్కు డిపాజిట్ విజయలక్ష్మీ, వాసిరెడ్డి వాసవి తదితరులు పాల్గొన్నారు.

వాడవాడలా జాతీయ జెండాను ఎగరవేయాలి : హరనాథ్

చాట్రాయి: సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ కేంద్ర కమిటీ పిలుపు మేరకు స్వాతంత్ర్యాన్ని, ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడండి నినాదంతో ఆగస్టు 15న వాడవాడలా జాతీయ జెండాను ఎగరవేయాలని లిబరేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డి. హరనాథ్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. జనార్దనవరంలో మంగళవారం కార్యకర్తలు సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్లమెంట్‌లో ఎస్ఐఆర్ పేరుతో ఓట్లు తొలగించటాన్ని ప్రతిపక్షాలు ప్రశ్నిస్తుంటే పాలకపక్షం సమాధానం చెప్పలేక వాయిదాల పర్వం కొనగించటం సిగ్గుచేటని, ఎస్ఐఆర్ అమలును తక్షణం రద్దు చెయ్యాలని డిమాండ్ చేశారు. లిబరేషన్ నాయకులు దుర్గం పుల్లారావు, వేముల బక్కయ్య, చాట్ల బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నాళ్లో వేచిన ఉదయం

ఆరేళ్ల తరువాత దొరికిన భార్యా పిల్లలు

కుటుంబానికి అప్పగించిన పోలీసులు

ఏలూరు క్రైం, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ఆరేళ్ల క్రితం అదృశ్యమైన తల్లి, ఇద్దరు పిల్లలను పోలీసులు గుర్తించి తీసుకొచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు. రాష్ట్ర డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా ఉత్తర్వులతో జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ శివ కిషోర్ ఆదేశాలపై ఆపరేషన్ ట్రేస్ కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా ఈ నెల 1 నుంచి చేపట్టారు. దీనిలో భాగంగా ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం ఈ మిస్సింగ్ కేసు లపై దృష్టిసారించింది. ఏలూరు రూరల్ పోలీస్ స్టేషన్‌లో 2019లో నమోదైన కేసును పరిశీలించారు. ఒక మహిళ ఆమె మూడేళ్ల కుమారుడు, రెండేళ్ల కుమార్తెను తీసుకుని వెళ్లిపోయింది. బంధువుల ఫిర్యాదుతో అప్పటిలో పోలీసులు ఆమె కోసం వెతికినా ఆచూకీ కానరాలేదు. ప్రస్తుతం ఆపరేషన్ ట్రేస్ నిర్వహిస్తున్న నేపథ్యంలో ఈ కేసుపై పోలీసులు దృష్టిసారించారు. ఆ కేసు పూర్వాపరాలను పరిశీలించారు. ఏలూరుకు చెందిన దుర్గా ప్రసాద్ గతంలో హైదరాబాద్‌లో పనిచేయడాని కి వెళ్లాడు.అదే సమయంలో వరంగల్‌లోని నాగా రానికి చెందిన వంటి సౌజన్య పనుల కోసం హైదరాబాద్ రాగా వారిద్దరూ ఒకే పనిలో ఉం డడంతో ప్రేమించుకున్నారు.ఆ తరువాత ఇద్దరూ ఏలూరు వచ్చి ఇక్కడ జీవిస్తుండగా కుమారెడు, కుమార్తె జన్మించారు.భర్త దుర్గా ప్రసాద్ మద్యం తాగుతూ బాధ్యతారాహిత్యంగా మారడంతో ఆమె విసుగు చెంది తన ఇద్దరి పిల్లలను తీసుకెళ్లిపో యింది. అప్పటి నుంచి పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి ఆ మహిళ ఆచూకీని పోలీసులు కనుగొన్నారు.వరంగల్‌లో జీవిస్తూ ఒక షాపులో పని చేస్తోందని గుర్తించారు. ఏలూరు రూరల్ ఎస్ఐ కె.నాగబాబు, కైకలూరు టౌన్ ఎస్ఐ వెంకట కుమార్, హెడ్ కానిస్టేబుల్ కనకాం బరం, హెడ్ కానిస్టేబుల్ పాండురంగారావు, కాని స్టేబుల్ విజయ్ కుమార్, మహిళా కానిస్టేబుల్ చైతన్యలు మొత్తం మీద ఆ తల్లి పిల్లలను గుర్తించా రు. వారిని ఏలూరు తీసుకొచ్చి మంగళవారం మధ్యా హ్నం ఏలూరు డీఎస్పీ కార్యాలయంలో భర్త దుర్గా ప్రసాద్‌కు ఆమె బంధువులకు అప్పగించారు. కుమారుడు 4వ తరగతి, కుమార్తె 3వ తరగతి చదువుతోందని తల్లి సౌజన్య చెప్పడంతో ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్ కుమార్ స్పందించి పుస్తకాలు, స్కూల్ బ్యాగ్‌ను అందజేసి బాగా చదువుకోవా లని ఆ పిల్లలను దీవించారు.ఏదైనా సహాయం కావాల్సి వస్తే తాను తన సిబ్బంది, అధికారులు అన్ని వేళలా అందుబాటులో ఉంటామని, అధైర్య పడొద్దని డీఎస్పీ హామీ ఇచ్చారు. భర్త ఇకపై బా ధ్యతగా మెలగాలని హెచ్చరించారు.



నూజివీడులో మాత్రల పంపిణీ

నులి పురుగుల నివారణ మాత్రల పంపిణీ

నూజివీడు టౌన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): జాతీయ నులిపురుగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని నూజివీడు బాలుర ఉన్నత పాఠశాలలో డిప్యూటీ డీఎంహెచ్‌వో లక్ష్మీనారాయణ విద్యార్థులకు డివార్మింగ్ మాత్రలను అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నూజివీడు డివిజన్ పరిధిలో 89,145 మందికి మాత్రలను అందించాలని లక్ష్యంగా నిర్దేశించా మన్నారు. ప్రతి పాఠశాలకు వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది వెళ్ళి మాత్రలను అందించటం జరుగుతోందన్నారు. కోనేరుపేట అర్బన్ పీహెచ్‌సీ వైద్య అధికారి డాక్టర్ సాయిసుధ, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు. నూజివీడు మండలం గొల్లపల్లి పీహెచ్‌సీ పరిధిలోని అన్నే రామకృష్ణయ్య జడ్పీ హైస్కూలులో బాలబాలికలకు మాత్రలు పంపిణీ చేశారు. నులిపురుగుల వల్ల వచ్చే రక్తహీనత ఏర్పడుతుందని, అందువల్ల వాటిని నిర్మూలించాలని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాస్ గౌతమ్ అన్నారు.

కైకలూరు: నులిపురుగుల నివారణతో పిల్లలు ఆరోగ్యంగా పెరుగుతారని పీహెచ్‌సీ వైద్యాధికారులు అనుపమ, అన్నపూర్ణ అన్నారు. కైకలూరు మండలంలోని సీతనపల్లి, కొల్లేటికోట పీహెచ్‌సీల ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్లల్లో, అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు నులిపురుగుల నివారణ మాత్రలను పంపిణీ చేశారు. సీతనపల్లి పీహెచ్‌సీ పరిధిలో 8123 మందికి గాను 7881 మందికి, కొల్లేటి కోట పీహెచ్‌సీ పరిధిలో 6265 మందికి గాను 6030 మందికి మాత్రలు అందజేసినట్లు వైద్యాధికారులు తెలిపారు. కొల్లేటికోట పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఆటపాక, భుజబలపట్నంలో వైద్యాధికారి హేమంత్ మాత్రలను పంపిణీ చేశారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆఫీసర్ దీప్తి, ఎంపీహెచ్‌వో రహీం, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ముసునూరు: నులిపురుగుల వల్ల పిల్లల్లో అనేక ఆరోగ్య సమస్యలు వస్తాయని, వాటి నివారణతోనే సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని వైద్యాధికారిణి డాక్టర్ ఎస్. రమ్య అన్నారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళ వారం ముసునూరు, రమణక్కపేట పీహెచ్‌ల వైద్యు లు, సిబ్బంది అవగహన ర్యాలీలు నిర్వహించారు. అనంతరం ఏడాది నుంచి 19 ఏళ్ళ వయస్సు గల విద్యార్థులకు ఆల్‌బెండాజోల్ మాత్రలను వేశారు.

కలిదిండి: కలిదిండి పీహెచ్‌సీ పరిధిలోని కలిదిండి, కాళ్లపాలెం, తాడినాడ, చినతాడినాడ, పోతుమర్రు గ్రామాల్లో మంగళవారం పాఠశాలల్లో విద్యార్థులకు, అంగన్‌వాడీ చిన్నారులకు నులిపురుగు నివారణ (ఆల్బెండాజోల్) మాత్రలు పంపిణీ చేసినట్లు కలిదిండి పిహెచ్‌సి వైద్యాధికారి జాహ్నవి తెలిపారు. మొత్తం 4,532 మందికి గాను 4,178 మందికి పంపిణీ చేశామన్నారు. మిగిలిన వారికి ఈ నెల 20న పంపిణీ చేస్తామన్నారు.

చాట్రాయి: వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు, కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నులిపురుగులు నివారణ మాత్రలు పంపిణీ చేశారు. పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ శ్రీనివాసరెడ్డి, డాక్టర్ దుర్గాప్రసాద్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ముదినేపల్లి: ముదినేపల్లి, దేవపూడి పీహెచ్‌సీల మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ శాంతిశ్రీ, డాక్టర్ వినయ్, హెల్త్ ఎడ్యుకేటర్ జోనాతన్ ఆధ్వర్యంలో మండలంలోని పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు నులిపురుగు నివారణ మందులు వేశారు. స్థానిక ఐటీఐ కళాశాల విద్యార్థులకు ప్రిన్సిపాల్ కూనపరెడ్డి సత్యనారాయణ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది నులిపురుగు నివారణ మందులు వేశారు.

సోషల్ మీడియాతో అప్రమత్తంగా ఉండాలి : సీఐ

చాట్రాయి, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియా పట్ల యువత అప్రమత్తంగా లేకుంటే ఇబ్బందులు తప్పవని నూజివీడు రూరల్ సీఐ రామకృష్ణ అన్నారు. చాట్రాయి వికాస్ కాలేజీలో మంగళవారం విద్యార్థులకు సైబర్ నేరాలు, ఫోన్‌స్కామ్స్, మాదక ద్రవ్యాల వినియోగం వలన నష్టాలు, పోక్సో చట్టం, బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, మైనర్ల డ్రైవింగ్ నిషేదంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థుల్లో సామాజిక బాధ్యత, చైతన్యం ఉండాలని, ఏదైనా సమస్య ఎదురైతే 112కి లేదా శక్తి యాప్ ద్వారా పోలీసులకు తెలియజేయాలని కోరారు. ఎస్సై డి. రామకృష్ణ, ప్రిన్సిపాల్ రామ్మోహన రెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ వేడుకలు

నూజివీడు టౌన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ఏఐఎస్ఎఫ్ 90వ ఆవిర్భావ వేడుకలను ఎమ్వీ జూనియర్ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏలూరు జిల్లా బాలికల కన్వీనర్ లోకేశ్వరి మాట్లాడుతూ తెల్లదొరల పాలన తరిమికొట్టడంలో ఏఐఎస్ఎఫ్ పాత్ర ఎంతో ఉందన్నారు. లక్నోలో 1936లో విద్యార్థి సంఘం ఆవిర్భవించిందన్నారు. ఎన్నికలకు ముందు టీడీపీ ఇచ్చిన జీవో నంబర్ 77 రద్దు హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. కో-కన్వీనర్ రాజ్యలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

నూజివీడు టౌన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): పెరిగిన ధరలకు అనుగుణంగా జీతాలు పెంచడంతో పాటు పారిశుద్య కార్మికులకు రెగ్యులర్‌గా జీతాలు జమ చేయాలని, ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి చాట్ల పుల్లారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు నూజివీడు ఏరియా ఆసుపత్రి సూపరిం టెండెంట్ పద్మజారాణికి వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుర్భర పరిస్థితుల్లో వైద్య విభాగ కార్మికులు ఉన్నారని, కాంట్రాక్టు వ్యవస్థను రద్దుచేసి పురపాలక కార్మికుల తరహాలో ఆప్కాస్ విధానాన్ని అమలు పరచాలన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ సక్రమంగా చెల్లించాలని, కావాల్సిన మెటీరియల్, జీతాలను రెగ్యులర్‌గా అందించాలని కోరారు. ఆసుపత్రి పారిశుద్య కార్మికులు వైపద్మ, రమాదేవి, మణి, సత్యవతి, రషీద తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి

చాట్రాయి, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని నరసింహారావుపాలెంలో స్వచ్ఛత-పరిశుభ్రత కార్యక్రమంలో భాగంగా మంగళవారం సర్పంచ్ వి.ప్రశాంతి ఆధ్వర్యంలో పంచాయతీ సిబ్బంది వీధులను శుభ్రం చేసి బ్లీచింగ్ చల్లారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమలు పుట్టకుండా, కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, కాచి చల్లార్చిన నీరు తాగాలని సర్పంచ్ విజ్ఞప్తి చేశారు. వైస్ ఎంపీపీ సుబ్బారెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పాడి రైతులకు బోనస్ పంపిణీ

చాట్రాయి, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నంపేట పాల సహకార సంఘానికి పాలు పోస్తున్న రైతులకు మంగళవారం అధ్యక్షుడు మారగాని పుల్లారావు రూ. 78,420 బోనస్ పంపిణీ చేశారు. కృష్ణా మిల్క్ యూనియన్ 2025-26 సంవత్సరానికి మొదటి విడత బోనస్ పంపిణీ చేసిందని, పాడి రైతులకు అనేక సంక్షేమ పథకాలను యూనియన్ అమలు చేస్తున్నదని, పాడి రైతులందరూ కృష్ణామిల్క్ యూనియన్‌కు పాలుపోసి ప్రయోజనాలు పొందాలని పుల్లారావు కోరారు. వేతన కార్యదర్శి నాగ సుజాత, పాడి రైతులు పాల్గొన్నారు.

ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ



కలిదిండి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద లంకలో మంగళవారం 27 అడుగుల అభయ ఆంజనేయస్వామి విగ్రహం వద్ద దున్న శ్రీనివాసరావు దంపతులు 3 అడుగుల స్వామివారి ఉత్సవ విగ్రహ ప్రతిష్ఠను వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేశారు. టీడీపీ గ్రామ మాజీ అధ్యక్షుడు దున్న భోగేశ్వరరావు, వెలమ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు అక్కుల వెంకటాచలం, గ్రామ పెద్దలు కోకా రాజా, అయినాల సత్యనారాయణ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

8 మంది జూదరుల అరెస్ట్

కైకలూరు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): గుట్టుచప్పుడు కాకుండా పేకాట నిర్వహిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు కైకలూరుటౌన్ ఎస్సై ఆర్. శ్రీను తన సిబ్బందితో దాడులు నిర్వహించారు. మంగళవారం వింజరం శాలిపేటలో పేకాట శిబిరంపై దాడి చేసి 8 మందిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.10,300 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఎక్కడైనా కోడి పందేలు, పేకాట వంటి జూదాలతో పాటు గంజాయి విక్రయించినా, ఎవరైనా సేవించినా వెంటనే 112కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

వివాహిత అదృశ్యం

ముదినేపల్లి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సింగరాయపాలెం దళితవాడకు చెందిన యువతి అదే గ్రామానికి చెందిన గోపి పదేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. ఆమె స్థానిక ఒక ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నది. ఎప్పటిలాగానే ఈ నెల 11న పనులకు వెళ్ళివచ్చిన ఆమె అదే రోజు రాత్రి అదృశ్యమైంది. తన భార్య ఇంటి వద్ద లేకపోవడంతో గోపి చుట్టు ప్రక్కల వెతికినా ఆచూకీ దొరకలేదు. వెంటనే తన అత్తగారికి ఫోన్ విషయం తెలిపాడు. దీంతో ఆమె కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో కుమార్తె అదృశ్యంపై తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముదినేపల్లి ఎస్ఐ వీరభద్రరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.